


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 325, పేజీలు - 08




శుక్రవారం, మే 15, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD

# విద్యార్థుల భవిష్యత్ 'డీమానిటైజ్' అయింది

**- పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి**

**- నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**
**- విద్యార్థుల భవిష్యత్ నిర్వీర్యం అయిందని ఆవేదన**
**- నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నీట్-యూజీ 2026 రద్దుపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ నియంతృత్వ నిరంకుశ నిర్ణయంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేండ్లుగా ప్రధాని నరేంద్రమోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని మండిపడ్డారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శలు గుప్పించారు.

**- దిగ్భ్రాంతికి గురి చేసిన నీట్ యూజీ 2026 రద్దు**

నీట్ యూజీ 2026 రద్దు అంశం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఇది కూడా పెద్ద నోట్ల రద్దు వంటిదేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన నిర్ణయాలు దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని మండిపడ్డారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు, దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది తల్లిదండ్రులు నగలు అమ్మి తమ పిల్లలను నీట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ చేయించారని వారి ఆశలన్నీ గల్లంతవ్వడం బాధాకరం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయని



సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

**- 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయి**

2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డెకేడ్" శ్వేతపత్రం ప్రకారం కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని సీఎం ప్రత్యేకంగా

2లో..

# లాయర్‌గా మారిన దీదీ

**- కోర్టులో స్వయంగా వాదించిన మమత**



కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ లాయర్ దుస్తుల్లో కోల్‌కతా హైకోర్టుకు హాజరయ్యారు. రాష్ట్రంలో ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ నేతలు చేసిన హింస, విధ్వంసాలపై పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా దీదీ న్యాయవాదిగా కోర్టుకు హాజరై జడ్జికి స్వయంగా వాదనలు వినిపించారు. న్యాయం కోసం తన పోరాటం సాగుతుందని మమత స్పష్టం చేశారు. ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలా నల్ల కోటు వేసుకుని కోర్టులో వాదించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా మమత పలు కీలక అంశాలపై పోరాటం చేసినా, న్యాయవాదిగా నేరుగా రంగంలోకి దిగడం ఇదే మొదటిసారి. తన వాదనలతో కోర్టులో అందరినీ ఆశ్చర్యపరిచిన ఆమె, చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించారు. రాజకీయ రణక్షేత్రం నుంచి న్యాయక్షేత్రానికి మారిన ఆమె శైలిని ఆమె అభిమానులు కొనియాడారు. ఎన్నికల అనంతర హింసపై

2లో..

# కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

**- ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ కోర్టు సమన్లు**
**- జూలై 31న హాజరు కావాలని ఆదేశం!**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు నిధుల దుర్వినియోగం కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు గట్టి షాక్ తగిలింది. ఈ వ్యవహారంలో ఏసీబీ దాఖలు చేసిన దాదాపు 250 పేజీల ఛార్జిషీట్‌ను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించింది. ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్ రెడ్డి సహా మరో ఇద్దరికి సమన్లు జారీ చేసింది.

2లో..

# దేశవ్యాప్తంగా మూడో దశ ఎస్ఐఆర్

**- ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో షెడ్యూల్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఇప్పుడు మూడో దశకు చేరుకుంది. గురువారం నాడు ఈసీ వెలువరించిన తాజా ఆదేశాల ప్రకారం పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, హర్యానాతో

2లో..

# వారానికి ఒక రోజు 'నో వెహికల్ డే'

**- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు**

**- ఇంధన పొదుపుపై ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు**
**- ఏపీ మంత్రివర్గ సమావేశంలో పొదుపుపై సుదీర్ఘ చర్చ**
**- మంత్రుల పర్యటన ఖర్చులు తగ్గించుకోవాలని సూచన**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతను గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు సంచలన నిర్ణయాలకు వేదికైంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వం భారీ పొదుపు చర్యలను ప్రకటించింది. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ భేటీలో కేవలం పాలనా పరమైన నిర్ణయాలే కాకుండా, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించింది.

**- వారంలో ఒకరోజు నో వెహికల్ డే**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా వారానికి ఒకరోజును నో వెహికల్ డే గా పాటించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆ రోజున మంత్రులు, ఉన్నతాధికారులు తమ సొంత, అధికారిక వాహనాలను పక్కన పెట్టాలని సీఎం సూచించారు. దానికి బదులుగా ప్రజా రవాణా ఆర్టీసీ బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలు లేదా సైకిళ్లను వాడాలని నిర్ణయించారు. సామాన్యులకు ఆదర్శంగా నిలిచేలా మంత్రులందరూ ఈ నిబంధనను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం తీర్మానించింది.

**- కాన్వాయ్‌ల సైజు సగానికి తగ్గింపు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే తమ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించుకోగా,

2లో..

# చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

**- ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన**
**- ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ విమర్శలు**
**- ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు.


తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు. ఈ సంస్థ ద్వారా సీడ్, ఫీడ్ నాణ్యత, ధరలను నియంత్రించడంతో

2లో..

# తెలంగాణ ఇంటర్‌లో భారీ మార్పులు

**- ఇక ఫస్ట్ ఇయర్ నుంచే ప్రాక్టికల్స్ - మ్యాథ్స్ సబ్జెక్టులోనూ కీలక మార్పులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో కీలక మార్పులు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు కలిసి ఈ మార్పులకు శ్రీకారం చుట్టాయి. 2026-2027 అకడమిక్ ఇయర్ నుంచే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో ఈ సరికొత్త మార్పులు అమల్లోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త ఇంటర్ విద్యా విధానంలో భాగంగా మ్యాథమేటిక్స్ సబ్జెక్టుతోపాటు ప్రాక్టికల్స్ పరీక్షల మార్కుల్లో మార్పులు చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో భయం లేకుండా వాటిపై మరింత ఆసక్తి పెంచేందుకే ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ఇక ఇప్పటివరకు ఇంటర్మీడియట్‌లో కేవలం సెకండ్ ఇయర్‌లో మాత్రమే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండేవి. కానీ తాజాగా తీసుకువచ్చిన మార్పుల ప్రకారం ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున సెకండియర్‌లో ప్రాక్టికల్స్ ఉండేవి. అయితే వీటిని ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్‌కు విడగొట్టారు.




2లో..

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

**- రాష్ట్రంలో మరింత పెరగనున్న ఎండలు**
**- రానున్న రోజుల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు**
**- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఉదయం 8 గంటలకే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం జంకుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం పూట రికార్డు

2లో..

# అన్నీ మీరే చేస్తే.. ఇక మేమెందుకు.?

**- కేంద్రానికి సుప్రీం చీవాట్లు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో అన్ని వ్యవస్థల్ని నియంత్రిస్తోందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్డీయే ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్, సీబీఐ డైరెక్టర్ వంటి కీలక నియామకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అత్యున్నత

2లో..

# బండి భగీరథ్ పోక్సో కేసులో వీడని ఉత్కంఠ

**- ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా వేసిన హైకోర్టు**
**- మధ్యంతర బెయిల్‌పై నేడు విచారణ జరుపుతామని వెల్లడి**
**- బాధితురాలి బర్త్ సర్టిఫికెట్లు పరిశీలించాలని ఆదేశం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు రాష్ట్రంలో గత వారం రోజులుగా తీవ్ర సంచలనం రేపుతుండగా ఈ వ్యవహారం తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చింది. అయితే ఈ పోక్సో కేసులో బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను వారం రోజులు వాయిదా వేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ శుక్రవారం రోజున మధ్యంతర బెయిల్‌కు సంబంధించిన విచారణను చేపట్టనున్నట్లు తెలిపింది. బండి భగీరథ్ తరపున లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించగా పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర రావు హాజరయ్యారు. ఈ కేసు వాదనల సందర్భంగా అసలు ఈ పోక్సో కేసు పెట్టిన బాధితురాలు మైనర్ బాలికనా కాదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బండి భగీరథ్ తరపున

2లో..

## విద్యార్థుల భవిష్యత్ 'డీమానిటైజ్' అయింది

ప్రస్తావించారు. ఈ వైఫల్యాల వల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని మండిపడ్డారు. 2024లో కేవలం 8 వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని గుర్తు చేశారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజి రద్దు అయిన అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని ప్రధాని నరేంద్రమోడీ తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

### - నీట్ రద్దు వల్ల ఆందోళన వద్దు

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా పేపర్ లీకులు పరీక్షల రద్దు జరిగిన అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ)చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసింది అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు.

## లాయర్‌గా మారిన దీదీ

సుదీర్ఘంగా సాగిన ఈ విచారణలో మమత అనేక సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచారు. శాంతిభద్రతలను కాపాడటమే తన ధ్యేయమని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని ఆమె బలంగా వాదించారు. కేవలం తన పార్టీ కార్యకర్తల కోసమే కాకుండా బాధితులందరికీ న్యాయం జరగాలని ఆమె కోరారు. మమత రాకతో కోర్టు ప్రాంగణం అంతా సందడిగా మారింది. కోర్టులో మమత చూపించిన తెగువ ఆమె రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చలకు నాంది పలికింది. ఒకవైపు రాజకీయ నాయకురాలిగా ప్రజల్లో ఉంటూనే, మరోవైపు న్యాయవాదిగా తన వాణిని వినిపించడం ద్వారా ఆమె తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. బాధితుల పక్షాన నిలబడి ఆమె చేస్తున్న ఈ పోరాటం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో అన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. తన పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదని ఆమె మరోసారి తేల్చిచెప్పారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో మమత లాయర్ వేషధారణలోని ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. నాయకురాలు అంటే ఇలా ఉండాలని కొందరు కామెంట్ చేస్తుంటే, ఇది కేవలం రాజకీయ ప్రచారంలో భాగమేనని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. విమర్శలు ఎలా ఉన్నా న్యాయస్థానంలో ఆమె వినిపించిన వాదనలు మాత్రం బలంగా ఉన్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆమె నమ్ముతున్నారు. దశాబ్దాల పాటు ప్రజల కోసం పోరాడిన అనుభవం మమతకు ఉంది. ఇప్పుడు అదే అనుభవంతో న్యాయవాదిగా కూడా తన గళాన్ని వినిపిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం ఎక్కడికైనా వెళ్తానని ఆమె నిరూపించారు. బెంగాల్ రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు ఎప్పుడూ జరగలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మొత్తానికి మమత తీసుకున్న ఈ నిర్ణయం అటు న్యాయ వ్యవస్థలోనూ, ఇటు రాజకీయాల్లోనూ పెద్ద మార్పుకు సంకేతంగా కనిపిస్తోంది. బాధితుల కన్నీళ్లను తుడిచేందుకు తనే స్వయంగా రంగంలోకి దిగడం ద్వారా ఆమె తన నిబద్ధతను చాటుకున్నారు. హైకోర్టు ఇవ్వబోయే తీర్పుపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. న్యాయం గెలుస్తుందనే నమ్మకంతో మమత తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

వీరంతా జూలై 31న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

### - రూ. 55 కోట్ల అక్రమ మళ్లింపు

2024లో జరగాల్సిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ. 55 కోట్ల నిధులను విదేశీ సంస్థలకు మళ్లించారనేది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా కేబినెట్ ఆమోదం లేకుండా, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోకుండానే ఈ భారీ మొత్తాన్ని విదేశీ కరెన్సీ రూపంలో బదిలీ చేయడంపై ఏసీబీ తన ఛార్జిషీట్‌లో కీలక ఆధారాలను పొందుపరిచింది. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ మౌఖిక ఆదేశాల మేరకే ఈ లావాదేవీలు జరిగినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే ఈ కేసులో గవర్నర్, కేంద్ర ప్రభుత్వం ప్రాసిక్యూషన్ అనుమతులు మంజూరు చేయడంతో కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది.

### - కోర్టు సమన్ల వెనుక అర్థమేంటి.?

సాధారణంగా దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుని సమన్లు జారీ చేసిందంటే నిందితులపై ఉన్న ఆరోపణల్లో ప్రాథమికంగా వాస్తవం ఉందని న్యాయస్థానం సంతృప్తి చెందిందని అర్థం. జూలై 31న కేటీఆర్ కోర్టుకు హాజరైనప్పుడు ఆయనకు ఛార్జిషీట్ కాపీలను అందజేస్తారు. ఆ దశలో ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవడమో లేదా ఆరోపణలను క్వాష్ చేయాలని కోరడమో చేయాల్సి ఉంటుంది. ఒకసారి విచారణ ప్రారంభమైతే మాత్రం ఇది రాజకీయంగా కేటీఆర్‌కు పెద్ద ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

### - రంగంలోకి ఈడీ

ఈ కేసులో ఏసీబీ దర్యాప్తుతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దూకుడు పెంచింది. విదేశీ నిధుల బదిలీ, మనీ లాండరింగ్ కోణంలో ఈడీ ఇప్పటికే ఆరా తీస్తోంది. రాజకీయంగా చూస్తే, ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంగా మారింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను గ్లోబల్ లెవల్‌కు తీసుకెళ్లడానికే రేసు నిర్వహించాం అని కేటీఆర్ సమర్థించుకుంటుండగా బ్రాండ్ ఇమేజ్ పేరుతో ప్రజా ధనాన్ని విదేశీ సంస్థలకు దోచిపెట్టారు అని రేవంత్ రెడ్డి సర్కార్ ఘాటుగా విమర్శిస్తోంది. ఏసీబీ కోర్టు తాజా నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. జూలై 31న కోర్టులో జరిగే పరిణామాలు కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని బీఆర్ఎస్ నేతలు టెన్షన్‌కు గురవుతున్నారు.

## దేశవ్యాప్తంగా మూడో దశ ఎస్ఐఆర్

పాటు తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. గతేడాది బీహార్‌లో ప్రారంభమైన ఈ స్పెషల్ రివిజన్, ఇప్పుడు దేశంలోని మెజారిటీ రాష్ట్రాలకు విస్తరించింది.

### - 36.73 కోట్ల మంది ఓటర్ల కవరేజ్

ఈ మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల డేటాను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం సుమారు 3.94 లక్షల మంది బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామాలు మారిన వారి వివరాలను సరిచేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, డూప్లికేట్ ఎంట్రీలను ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్న వాటిని తొలగించడం ఈ డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యం. రాజకీయ పార్టీలు కూడా తమ తరపున 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ఈ ప్రక్రియను పర్యవేక్షించవచ్చు.

### - జనగణనతో అనుసంధానం

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని, ఈ ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను ఈసీ ఖరారు చేసింది. రెండింటికీ ఒకే రకమైన యంత్రాంగం అందుబాటులో ఉండటం వల్ల పనులు వేగంగా పూర్తవుతాయని కమిషన్ భావిస్తోంది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, సెన్సస్ ఫేజ్-2 పనుల దృష్ట్యా, అక్కడ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఈసీ స్పష్టం చేసింది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ మే నెలాఖరు నాటికి ముమ్మరం కానుంది.

### - తొలి రెండు దశల ప్రస్థానం

ఇప్పటికే మొదటి రెండు దశల్లో భాగంగా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రత్యేక ప్రక్షాళన పూర్తయింది. అక్కడ సుమారు 59 కోట్ల మంది ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. తాజా మూడో దశతో కలిపి దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి రానుంది. ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ లింకింగ్ వంటి అంశాలపై కూడా ఈ సమయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

### - పారదర్శకతే లక్ష్యం

ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ ప్రాధాన్యతని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొని, బూత్ స్థాయిలో సహకరించాలని ఈసీ కోరింది. 2027లో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందే లోప రహిత ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలనే పట్టుదలతో కమిషన్ ఈ భారీ కసరత్తును నిర్వహిస్తోంది

## వారానికి ఒక రోజు 'నో వెహికల్ డే'

ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మంత్రులందరికీ వర్తింపజేయాలని కేబినెట్ నిర్ణయించింది. జిల్లాల పర్యటనల్లో కూడా భద్రతా ప్రోటోకాల్ దెబ్బతినకుండా వాహనాల వినియోగాన్ని పరిమితం చేయాలని ఆదేశించారు. అనవసరమైన విదేశీ పర్యటనలను కూడా కొన్నాళ్ల పాటు వాయిదా వేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు.

### - వర్క్ ఫ్రమ్ హోమ్, వర్చువల్ మీటింగ్స్

పాలనా యంత్రాంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి ఖర్చులను తగ్గించాలని కేబినెట్ నిర్ణయించింది. సచివాలయానికి లేదా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం కల్పించాలని, వీలైనంత వరకు సమావేశాలను వర్చువల్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించారు. ఇది రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, సమయాన్ని కూడా ఆదా చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీ టెంపరేచర్‌ను 24 నుండి 27 డిగ్రీల మధ్య నిర్వహించడం ద్వారా విద్యుత్ ఆదా చేయాలని నిర్ణయించారు.

### - భవిష్యత్తు నగరం.. సోలార్ వైపు పయనం

ప్రభుత్వ భవనాలు కార్యక్రమాల్లో సోలార్ ఎనర్జీ వినియోగాన్ని పెంచాలని, అట్టహాసంగా చేసే ఖర్చులను నియంత్రించాలని నిర్ణయించారు. అమరావతి నిర్మాణ పనులపై కూడా చర్చించిన కేబినెట్, అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ పొదుపు చర్యల ద్వారా ఆదా అయ్యే నిధులను రాష్ట్రంలోని ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

పాటు, ఆక్వా ఉత్పత్తులకు ప్రభుత్వమే ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, ఆక్వా రైతులకు యూనిట్ కరెంటును కేవలం రూ.1.50కే అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు. అయితే, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగానే ఏపీఎస్ఏడీఏను నిర్వీర్యం చేసి, తమ ప్రభుత్వ చర్యలన్నింటినీ నీరుగార్చిందని విమర్శించారు. ఏపీఎస్ఏడీఏ అనుమతి లేకుండా కంపెనీలు ధరలు పెంచాయని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం ప్రజల చెవిలో పువ్వులు పెట్టడానికేనని జగన్ ఎద్దేవా చేశారు. "ఒక ప్రభుత్వాన్ని, చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది? వాళ్లు మీవాళ్లు కాబట్టే కదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫీడ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేశామంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని హితవు పలికారు. పెంచిన ధరలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల పక్షాన వైసీపీ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

## తెలంగాణ ఇంటర్‌లో భారీ మార్పులు

ఈ నిర్ణయం వల్ల ఫస్టియర్ నుంచే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై పట్టు ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఇంటర్మీడియట్‌లో కీలక సబ్జెక్ట్ అయిన మ్యాథ్స్‌లో కూడా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. మ్యాథ్స్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం మ్యాథ్స్ సబ్జెక్టులో 15 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా వేయనున్నారు. ఇక ఫైనల్ పరీక్షల్లో మ్యాథ్స్ సబ్జెక్టుకు ఇప్పటివరకు 75 మార్కులు ఉండగా 15 మార్కులను తీసేసి ఇక నుంచి 60 మార్కులకు మాత్రమే పరీక్షను నిర్వహించేలా ఇంటర్ బోర్డు తాజాగా కీలక మార్పులు చేసింది. మరోవైపు లాంగ్వేజీ పరీక్షల్లో కూడా కీలక మార్పులను ప్రవేశపెట్టారు. ఇంగ్లీష్, తెలుగు లేదా సంస్కృతం సబ్జెక్టులకు కూడా 100 మార్కులకు బదులుగా 80 మార్కులకే పరిమితం చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థులకు వేయనున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు బట్టీపట్టే విధానాన్ని తగ్గించి వారికి జ్ఞాపకశక్తిని పెంపొందించేలా ప్రాక్టికల్స్ స్కిల్స్‌ను పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త విద్యావిధానాన్ని తీసుకువచ్చినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ

స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు తాజాగా వాతావరణ శాఖ అధికారులు కీలక విషయాలు చెప్పారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరగనున్నట్లు తెలిపారు. మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఏకంగా రెడ్ అలర్ట్ జారీ చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రానున్న 3 రోజుల పాటు ఉత్తర తెలంగాణలో సూర్యుడి ప్రతాపం తీవ్రరూపం దాల్చనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. మరీ ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అత్యధికంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి మధ్యాహ్నం పూట బయటికి రావద్దని హెచ్చరికలు చేశారు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరీ ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక రోగులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా ఈనెల 16, 17, 18వ తేదీల్లో తెలంగాణ వ్యాప్తంగా వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ఇక రాష్ట్రంలో గత 2 రోజుల నుంచి ఎండ తీవ్రత పెరగడం గమనార్హం. ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.5 డిగ్రీల వరకు నమోదు కాగా మెదక్‌లో 42 డిగ్రీలు హైదరాబాద్ సహా మిగిలిన జిల్లాల్లో సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## అన్నీ మీరే చేస్తే.. ఇక మేమెందుకు.?

న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సుప్రీంకోర్టులో కేంద్రం ఇరుకునపడింది. అయినా తమ చర్యల్ని సమర్థించుకునేందుకు ప్రయత్నించింది. సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్నారని, కానీ ఎన్నికల ప్రధాన అధికారిని ఎంపిక చేసే కమిటీలో మాత్రం ఆయన లేకపోవడం ఏంటని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియను నడిపించే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక విషయంలోనే ప్రజాస్వామ్యం లేకపోవడమేంటని నిలదీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది."నాకు ఒక సందేహం కలుగుతోంది. సీబీఐ డైరెక్టర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అని మనం అనుకోవచ్చు. లేదా దీనిని చట్టబద్ధమైన పాలన అని కూడా భావించవచ్చు. కానీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి లేరా? స్వచ్ఛమైన ఎన్నికలు జరిగేలా చూడటానికి లేరా?" అని విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. సీజేఐ ఉండాలని మనం చెప్పడం లేదని, కానీ ఒక స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదు? మంత్రివర్గం నుంచే ఎందుకు ఉండాలి? మనం చాలా స్పష్టంగా ఉందాం. ఈ రోజు ప్రధానమంత్రి ఒకరిని ఎంపిక చేస్తారు.

విపక్ష నేత మరొకరిని ఎంపిక చేస్తారు, వారి మధ్య అభిప్రాయ భేదం ఉంది. మూడో సభ్యుడు ప్రతిపక్ష నాయకుడి వైపే వెళ్తారా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ, అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి తాను ఊహాగానాలు చేయదలచుకోలేదని అన్నారు. అలాగైతే, ప్రతిదీ నియంత్రించేది కార్యనిర్వాహక వర్గమే కదా అని జస్టిస్ దత్తా అన్నారు. ఇలాంటి నియామకాలపై నిర్ణయం వాస్తవానికి 2:1 మెజారిటీతో ఆమోదించబడుతుందని, కేబినెట్ మంత్రి ప్రధానమంత్రి వైఖరితో విభేదించే అవకాశం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రాథమికంగా మమ్మల్ని కలవరపరిచే విషయం ఏమిటంటే, కార్యనిర్వాహక వర్గానికి వీటో అధికారం ఎందుకు ఉంది? ఇన్ని పూర్వపు తీర్పులు ఉన్న తర్వాత కూడా ఈ కేసుల గురించి పార్లమెంటుకు తెలియదా? చట్టాలను రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉంది, కానీ సుప్రీంకోర్టు అంతిమ నిర్ణేత. మీకు నచ్చినా నచ్చకపోయినా చట్టాలను వ్యాఖ్యానించే అధికారం దానికి ఉంటుందని జస్టిస్ దత్తా స్పష్టం చేశారు.

## హాస్టల్‌లో మహిళ అనుమానస్పద స్థితిలో మృతి

**హైదరాబాద్** మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధి మధురానగర్ మధురానగర్ లో భార్గవి లేడీస్ హాస్టల్లో హారిక ( 40 ) బాత్రూంలో పడి అనుమానాస్పద మృతి చెందింది, ఆమె .. చనిపోయి రెండు రోజులు అయ్యి ఉంటుందని పోలీసుల సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న మధుర నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు. గుంటూరు కి చెందిన మృతురాలు. హాస్టల్ టెర్రస్ పైన సింగిల్ గా ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు.

## బండి భగీరథ్ పోక్సో కేసులో వీడని ఉత్కంఠ

వాదనలు వినిపించిన లాయర్ నిరంజన్ రెడ్డి అసలు ఆమె మైనర్ కాదని ఆమె వయసు 19 ఏళ్ల నుంచి 20 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఆమె రకరకాల తేదీలతో వేర్వేరు బర్త్ సర్టిఫికెట్లు తీసుకుందని కోర్టుకు విన్నవించారు. బాధితురాలి తల్లి కావాలనే తప్పుడు రికార్డులు, సర్టిఫికెట్లతో ఆమె వయసును తగ్గించి పోక్సో కేసు పెట్టించారని ఆరోపించారు.మరోవైపు పోక్సో కేసులో కూడా పిటిషనర్‌కు కొన్ని హక్కులు ఉంటాయని పేర్కొన్న లాయర్ నిరంజన్ రెడ్డి పోక్సో చట్టంలోని సెక్షన్ 11 పరిధిలోకి పిటిషనర్ రారని పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 74, 75 కింద ఆరోపణలు రుజువు కాలేదని వివరించారు. తన క్లైయింట్ బండి భగీరథ్ నుంచి బాలిక ఫ్యామిలీ రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు లాయర్ తెలిపారు. అంతేకాకుండా తన క్లైయింట్‌ను బెదిరించడమే కాకుండా ఆ డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు బెదిరింపులకు దిగిందని వాదించారు.ఇక బాలిక, ఆమె కుటుంబం బెదిరింపులు, వేధింపులు తట్టుకోలేని బండి భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హనీట్రాప్ కేసు పెట్టినట్లు తెలిపారు. కేంద్రమంత్రి కుమారుడు కావడంతో వారు తన క్లైయింట్‌పై కుట్ర చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒకసారి ఎఫ్ఐఆర్ పెట్టిన తర్వాత సెక్షన్లను మార్చడం చాలా అనుమానాలకు దారి తీస్తోందని వెల్లడించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత కావాలనే సెక్షన్లను మార్చారని ఆరోపించారు. ఇది ఒక కుట్రగా భావించాలని కోర్టుకు విన్నవించారు. బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత నిజానిజాలు తెలుసుకుని సెక్షన్లను మార్చినట్లు బాధితురాలి తరపున వాదనలు వినిపిస్తున్న లాయర్ పీపీ నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు.రెండు వైపులా వాదనలు విన్న హైకోర్టు వెకేషన్ బెంచ్ బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్?పై విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా బాధితురాలి పుట్టిన తేదీకి సంబంధించి వేర్వేరు సర్టిఫికెట్లు ఉండటం గతంలో ఆమె రాష్ డ్రైవింగ్ కేసులో పోలీసులు ఫైల్ చేసిన ఛార్జిషీట్‌లో ఆమె వయసు ఎక్కువగా ఉండటం వంటి వాటిపై విచారణ జరపాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆమె వయసుపై పోలీసులు ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పింది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ వచ్చే వరకు పోలీసులు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అతని తరపు లాయర్ కోరగా ఈ కేసులో మధ్యంతర బెయిల్?పై నేడు విచారణ జరుపుతామని హైకోర్టు తేల్చి చెప్పింది.

## భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



మధురవాడ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ప్రక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనం పై నుండి ప్రమాదవశాత్తు పడి భవన నిర్మాణ కార్మికుడు ఉంకుల రాము(47)మృతి చెందాడు శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మానికి చెందిన రాము,గత కొంత కాలంగా ఇక్కడ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేక రించారు మృతునికి డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు కుమారుడు యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ జి.బాలకృష్ణ ఆదేశాలతో ఎస్.ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాధా రంగ మిత్రమండలి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్ఐసీ రాంబాబు

**గుడివాడ** స్థానిక గుడ్లవల్లేరు మండలంలో వేమవరంలో రాధా రంగా మిత్ర మండలిలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి రాంబాబును స్టేట్ రాధా రంగ మిత్రమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండు తెలుగు రాష్ట్రాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు పాల్గొన్నారు బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ రంగా అంటే ఒక సామాన్యమైన వ్యక్తి కాదు ఒక కులానికో మతాన్ని కో ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి కాదు అన్ని కులాలకు మతాలకు సంబంధించిన ఒక శక్తి అంటూ ఆయన తెలియజేశారు వంగవీటి మోహన రంగా ఆశయాలకు అనుగుణంగా ఈరోజు పనిచేయడానికి ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు మన రాష్ట్రంలో దేశంలోనే కాక ఇతర దేశాలలో కూడా రంగా అభిమానులు ఆయన ఆశయాల కోసం పని చేస్తున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రాధా రంగ మిత్రమండలి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎల్ఐసి రాంబాబు ని నియమించడం ఎంతో గర్వకారణంగా ఉంది అంటూ ఆయనను కొనియాడారు ఆయన గతంలో 2009లో మచిలీపట్నం అసెంబ్లీ బిజెపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు అలాగే ఏపీ శాలివాహన సంఘం కన్వీనర్గా ఏపీ ఎంబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఏపీ బీసీ సంఘం జాయింట్ సెక్రెటరీగా ఏపీ స్టేట్ అంబేద్కర్ పూలే సంఘం స్టేట్ ఫౌండర్ ఆయన కొనసాగుతున్నారు ఎల్ఐసి రాంబాబు మాట్లాడుతూ రాధా రంగా మిత్రమండలి లో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నన్ను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఎల్ఐసి రాంబాబు తెలియజేశారు రంగా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాను ఎటువంటి చిన్న సమస్య వచ్చినా కూడా మా పెద్దలు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాను అంటూ నాకు ఈ పదవి ఇచ్చిన బుల్లెట్ ధర్మారావు మరియు రాధా రంగ మిత్రమండలి సభ్యులకు అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు రాధా రంగా మిత్రమండలి గుడివాడ అధ్యక్షులు వడ్డే గిరి, రాధా రంగ మిత్రమండలి నాయకులు మహిళలు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

**సికింద్రాబాద్.**పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షంనేతలు మెట్టుగూడా కూడలి వద్ద నిరసన చేశారు. బండి సంజయ్ ని కేంద్రమంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మైనర్ అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన భగీరథ్ కేంద్రమంత్రి కొడుకు కావడంతో అరెస్ట్ చేయడం లేదా అని ప్రశ్నించారు. సామాన్యులకు ఒక చట్టం, పెద్దోలకు ఒక చట్టం ఉందా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని లేని యెడల అఖిలపక్షం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## భర్తపై పోక్సో కేసు..

### విడుదల చేయాలంటూ టవర్ ఎక్కిన యువతి

ఒక జంట ఇంటి నుంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. యువతి తల్లి ఫిర్యాదుతో యువకుడిపై కిడ్నాప్ కేసు తోపాటు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఆ వ్యక్తిని కోర్టుకు తరలిస్తుండగా ఆ యువతి సమీపంలో ఉన్న టవర్ ఎక్కింది. తన భర్తను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. 2025 అక్టోబర్‌లో యువతీ, యువకుడు కలిసి తమ ఇళ్ల నుంచి పారిపోయారు. వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు.కాగా, తన కుమార్తెను కిడ్నాప్ చేసినట్లు యువతి తల్లి ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో యువతి మైనర్ కావడంతో కిడ్నాప్‌తో పాటు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.మరోవైపు మే 12న జైలులో ఉన్న ఆ వ్యక్తిని కేసు విచారణ కోసం కోర్టుకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆ యువతి, పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న హై టెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ ఎక్కింది. తన భర్తను విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేసింది.ఇది తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఆ యువతికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో కోర్టు అనుమతితో ఆ వ్యక్తిని అక్కడకు తీసుకువచ్చారు. తన భర్తను చూసిన తర్వాత ఆ యువతి టవర్ నుంచి కిందకు దిగింది. ఆ తర్వాత వారిద్దరూ కౌగిలించుకుని భావోద్వేగంలో మునిగిపోయారు.అనంతరం పోలీసులు ఆ వ్యక్తిని జైలుకు తరలించారు. టవర్ ఎక్కి నిరసన తెలిపిన ఆ యువతికి నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ ఇస్తామని పోలీస్ అధికారి తెలిపారు.

## వైఎస్ జగన్ను కలిసిన మామిళ్ళపల్లి రైతులు

**తాడేపల్లి** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ను మామిళ్ళపల్లి రైతులు కలిసారు. తాము పంట నిల్వ చేసుకున్న గోడౌన్పై టీడీపీ శ్రేణులు దాడి చేయడం, రాడ్లతో గోడౌన్ తాళాలు పగలగొట్టి అరాచకం చేయడం, అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేసిన తీరును జగన్కు వివరించారు.టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మిళ్ళపల్లిలో విధ్వంసం సృష్టించిన విషయాన్ని ఫోటోలు, వీడియోలుజగన్కు చూపించారు.

## పొదుపు చర్యలపై ప్రచార కార్యక్రమాలు

**అమరావతి** గురువారం నాడు రాష్ట్ర సచివాయలంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పొదుపు చర్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. నాదేశం – నా బాధ్యత పేరుతో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కొన్నాళ్ల పాటు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు అవుతాయి. వారానికి ఒకరోజు నో వెహికల్ డే.. ప్రత్యామ్నాయ రవాణాపై దృష్టిపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పర్యటనలలోనూ కాస్ట్ కటింగ్ పాటించాలి. మెజారిటీ మీటింగ్స్ వర్చువల్ గా నిర్వహించాలని ఆదేశం ఇచచారుజ ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కల్పించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల టెంపరేచర్ ను 24 నుంచి 27 మధ్య నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలి . మంత్రుల నుంచి అధికారుల వరకు వాహనాల సంఖ్యను, వినియోగాన్ని తగ్గించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

## కల్లు కంపౌండ్ మాకొద్దు

**– ఖైరతాబాద్ లో మహిళల నిరసన**

**హైదరాబాద్** ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్ నగర్లో చింతల్ బస్తీ నుండి సాయిబాబా గుడి రోడ్డులో కల్లు కాంపౌండ్ ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బస్తీ మహిళలు, యువకులతో కలిసి భారీ స్థాయిలో ధర్నా నిర్వహించారు.ఈ రహదారి ఆనంద్ నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలకు ప్రధాన మార్గం కావడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు, సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కల్లు కాంపౌండ్ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్థానిక ప్రజలకు మద్దతు తెలిపారు. అలాగే బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్ తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు బీభత్సం

**– యువకుడికి గాయాలు**

**సికింద్రాబాద్**(సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్రయాణికులపైకి దూసుకెళ్లడంతో వారంతా పరుగులు తీసారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. . బస్సు ఢీకొట్టడంతో యువకుడు గాయాల పాలైయాడు. తోటి ప్రయాణికులు 108 కి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడికి ప్రాథమిక చికిత్స అందించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

### నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా

## కేంద్రం ప్రభుత్వం వైఫల్యం

**– ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా కేంద్రం ప్రభుత్వం వైఫల్యం అని, నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు.పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైందన్నారు. లీకేజీ వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శికించాలన్నారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, ఏఐఓబిసిఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధు యాదవ్, జెవిఎస్ విద్యార్థి సంఘం అధ్యక్షులు చేరాల వంశీ, ఓయూ ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు ఆవుల శ్రీధర్, సురేందర్, ఏంబిసి ఫోరమ్ అధ్యక్షులు అశ్వన్, ఓయూ విద్యార్థి నాయకులు ప్రభాకర్, భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## రూ. 2.58 లక్షల డ్రగ్స్ పట్టివేత..

**– ఎం డి ఎం ఏ, ఓ జి కుష్, చెరస్ డ్రగ్స్ ను స్వాధీనం.**


**– కారుతోపాటు ఇద్దరి అరెస్ట్..**



**కుత్బుల్లాపూర్** బడా బాబుల పిల్లల కు డ్రగ్స్ అమ్మకాలు జరిపి భారీగా సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ బి టీం ఇద్దరు ఎస్ఐలు సిబ్బంది కలిసి అరెస్ట్ చేశారు. సూరారం కొంపెల్లి హై టెన్షన్ రోడ్ లో డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు, సంధ్య లతో పాటు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు ఇనోవా కారును గుర్తించి నిలిపి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కారులో ఉన్న ప్రవీణ్ వద్ద బెంగళూరు నుంచి కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన 3.24 ఎటఎజీ డ్రగ్సును, ఎలిజర్ అలియాస్ సన్నీ వద్ద 36.90 ఓ జి కుష్ 7.73 గ్రాముల చెరస్ ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తో పాటు టవేటో కార్ ను కూడా సీజ్ చేశారు. పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ. 2.58 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. నిందితులను డ్రగ్స్ ను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.

## ప్రధాని మోదీ సూత్రాలు ..సప్త పరివర్తన"ను ప్రజలు ఆచరించాలి

**– మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్**



**హైద్రాబాద్** : దేశ ఆర్థిక భద్రత కోసం ప్రధాని మోదీ సూచించిన "సప్త సూత్రాలు సప్త పరివర్తన"ను ప్రజలు ఆచరించాలని మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూదేశ ఆర్థిక భద్రత కోసం ప్రధానమంత్రి మోదీ సూచించిన "సప్త సూత్రాలు సప్త పరివర్తన" గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా రష్యా?ఉక్రెయిన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంత పరిణామాలు వంటి అంతర్జాతీయ పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భారతదేశం "ఆవలవశ్రీనీజూతినిణ ఔజీబితినీని" నుంచి "ఆవలవశ్రీనీజూవట ఔజీబితినీని"గా ఎదగాలంటే దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు.దేశ అభివృద్ధి రేటు దెబ్బతినకుండా, భవిష్యత్ ఆర్థిక సవాళ్లను ముందుగానే ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ గారు ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఈ సప్త సూత్రాలు రాజకీయాల కోసం కాకుండా దేశ ఆర్థిక భద్రత కోసం చేసినబాధ్యతాయుతమైన విజ్ఞప్తి అని అన్నారు.భారతదేశం ప్రస్తుతం భారీ ట్రేడ్ డెఫిసిట్ను ఎదుర్కొంటోందని పేర్కొంటూ, ప్రతి సంవత్సరం సుమారు 700 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతుండగా, ఎగుమతులు దాదాపు 400 బిలియన్ డాలర్ల వరకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 300 బిలియన్ డాలర్ల ట్రేడ్ డెఫిసిట్ దేశ కరెన్సీ విలువపై ప్రభావం చూపుతోందన్నారు.దేశ కుటుంబ పెద్దగా ప్రధాని మోదీ గారు 140 కోట్ల భారతీయుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని బాధ్యతాయుతమైన సూచనలు చేశారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ గారు సూచించిన సప్త సూత్రాల్లో ముఖ్యంగా ఒక సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని కోరారని, శాశ్వతంగా కొనొద్దని కాదు, కేవలం తాత్కాలిక నియంత్రణ మాత్రమేనని స్పష్టం చేశారు.భారతదేశం ప్రపంచంలో చైనా తర్వాత అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశమని, ప్రతి సంవత్సరం దాదాపు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతోందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.5.5 లక్షల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్ల వరకు ఉంటుందని, ఇందులో 95 శాతం వ్యక్తిగత వినియోగానికే ఉపయోగపడుతోందన్నారు.భారతీయుల వద్ద ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక ప్రైవేట్ గోల్డ్ నిల్వలు ఉన్నాయని, కేవలం 25 శాతం బంగారం కొనుగోళ్లు తగ్గించినా భారీగా విదేశీ మారక ద్రవ్యం ఆదాచేయవచ్చన్నారు. అదే మొత్తాన్ని భూమి, తయారీ రంగం లేదా మార్కెట్లలో పెట్టుబడులుగా మళ్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు.పెట్రోల్, డీజిల్ దిగుమతులపై భారత్ భారీగా ఖర్చు చేస్తోందని పేర్కొంటూ, ప్రజలు పబ్లిక్ ట్రాన్స్పోర్ట్, కార్ పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచి, అనవసర ప్రయాణాలను తగ్గిస్తే విదేశీ మారక ద్రవ్యం ఆదాఅవుతుందన్నారు.కరోనా సమయంలో విజయవంతంగా అమలైన "చినీతీని ఈతీనీఎ ఊనీఎవ" విధానాన్ని సాధ్యమైనంత వరకు కొనసాగిస్తే ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు."నేను ఒక డాక్టర్గా చెబుతున్నాను భారతదేశంలో అధికంగా వంటనూనె వినియోగం జరుగుతోంది. ఫ్రైడ్ ఫుడ్స్ అధికంగా తినడం వల్ల బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. ప్రతి కుటుంబం నెలకు కనీసం ఒక లీటర్ ఆయిల్ వినియోగం తగ్గించినా దేశానికి వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ప్రజల ఆరోగ్య ఖర్చులు కూడా తగ్గుతాయి" అని డా. బూర నర్సయ్య గౌడ్ గారు పేర్కొన్నారు.సహజ వ్యవసాయం, ఆర్గానిక్ ఫార్మింగ్ను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల దిగుమతులను తగ్గించవచ్చని, భూమి సారాన్ని కాపాడటంతో పాటు రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు."స్వదేశీ" ఉత్పత్తులను వినియోగించాలన్న ప్రధాని పిలుపు వెనుక స్పష్టమైన ఆర్థిక దృష్టి ఉందని పేర్కొంటూ, విదేశీ బ్రాండ్లపై ఆధారపడకుండా భారతీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే దేశ సంపద దేశంలోనే ఉంటుందన్నారు. చిన్న ఉత్పత్తుల నుంచి లగ్జరీ వాహనాల వరకు స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్పై భారతీయులు భారీగా ఖర్చు చేస్తున్నారని, మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పుడు విదేశీ ఖర్చులను కొంతవరకు తగ్గించడం ద్వారా కూడా విదేశీ మారక ద్రవ్యం సేవ్ చేయవచ్చన్నారు.ఈ సప్త సూత్రాలను ప్రజలు కనీసం 25 శాతం స్థాయిలో అయినా అమలు చేస్తే దేశ ట్రేడ్ డెఫిసిట్ను గణనీయంగా తగ్గించవచ్చని, రూపాయి విలువ బలపడుతుందని, భారతదేశం మరింత ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని తెలిపారు.బంగారం పెట్టుబడుల కంటే భూమి, ఉత్పత్తి రంగాలు, మార్కెట్లలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఉనీశ్రీట ఖఈలు, ానీలవతీవతిణని ఉనీశ్రీట ఃనీనిటబ వంటి ప్రత్యామ్నాయాల ద్వారా కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు.ప్రధాని మోదీ గారు "ఖతీజీఇబితిఇవ చిష్ట్రజీబి జనీబీ ఖతీవజీఇష్ట్ర" అనే విధానాన్ని స్వయంగా ఆచరిస్తున్నారని పేర్కొంటూ, దేశ నాయకులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముందుగా ఈ సూత్రాలను పాటిస్తే ప్రజలు కూడా అనుసరిస్తారని తెలిపారు.భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః" అనే శ్లోకాన్ని ఉదహరిస్తూ, నాయకులు ఏది ఆచరిస్తారో ప్రజలు అదే అనుసరిస్తారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనం కోసం అందరూ కలిసి ఈ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ అంశాలను రాజకీయ కోణంలో కాకుండా జాతీయ ప్రయోజన దృష్టితో చూడాలని ప్రజలను కోరుతూ, భారతదేశం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని డా. బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు.

## పోలీసుల కళ్ళు కప్పి..

### తాండూరు పోలీస్ స్టేషన్ నుండి నిందితుడి పరార్

**- గత ఐదు రోజుల క్రితం సంఘటన గోప్యంగా ఉంచిన పోలీసులు**

**- నిందితుడి కోసం యూపీకి ప్రత్యేక బృందం - ఇద్దరు సిబ్బందిపై వేటు పడే ఛాన్స్**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో కిడ్నాప్ కేసులో అరెస్టయిన ఓ నిందితుడు తాండూరు పోలీస్ స్టేషన్ నుండి పోలీసుల కళ్ళుగప్పి పరారైన సంఘటన చోటుచేసుకుంది. యూపీ ముజఫర్ నగర్ కు చెందిన అజీమ్ అనే వ్యక్తి తాండూర్ లోని ఓ ఎయిర్ సెలూన్ లో గత ఆర్నెల్లుగా పనిచేస్తున్నాడు.తాను నివాసం ఉండే ఏరియాలో 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఇంట్లో నుండి బాలికను తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తాండూరు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న తాండూర్ పట్టణ పోలీసులు గత శనివారం మైనర్ బాలికను ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి బాలికను ఢిల్లీ తీసుకు వెళ్తున్న ఆసిఫ్ అలియాస్ అజిమ్ ను హైదరాబాదులో అరెస్టు చేసి రిమాండ్ కోసం తాండూరు తీసుకువచ్చారు. రిమాండ్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఐదు రోజుల క్రితం నిందితుడు చేతికి వేసిన సంకెళ్లతో పోలీస్ స్టేషన్ నుండి పరారైనట్లు సమాచారం. నిందితుడు పరారైన సంఘటనలో విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు పోలీసులపై వేటుపడే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. గత ఐదు రోజుల క్రితం పోలీస్ స్టేషన్ నుండి నిందితుడు పరారైన విషయం పోలీసులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

## డీజిల్ పెట్రోల్ వద్దు ..బ్యాటరీ సోలార్ ముద్దు

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి**



**వరంగల్** వరంగల్ చౌరస్తాలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీ హరి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు ముఖ్య ఉద్దేశం పెట్రోల్ డీజిల్ గ్యాస్ వాటి మీద భారతీయులు ఎప్పుడుఆధారపడవద్దని ఇతర దేశాల మీద ఆధారపడవద్దని ఏ దేశంలో యుద్ధం జరిగిన ఆ యొక్క ఎఫెక్ట్ భారతదేశ మీద కూడా పడుతుందని దాని ద్వారా సమర్లు విజిల్ పెట్రోల్ గ్యాస్ లాంటి ప్రజలకు టైముకుఅందకపోవడం వాటిపై అతిగా అధికమైన రేట్లు పెట్టడం ఇది వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు కనుక ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగం పెంచాలి పెట్రోల్ డీజిల్ ని ఆదా చేయాలి పాత వ్యవస్థలో సైకిల్ విధానం అనేది చాలా గొప్పది దానివల్ల ఆరోగ్యమే కాకుండా ఆర్థిక భారం తగ్గుతుంది ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ బ్యాటరీ సోలార్ బండ్లను వినియోగించుకోవాలని అలాగాకముఖ్యమంత్రులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మిగతా రాజకీయ నాయకులు వారి యొక్క సెక్యూరిటీ వాహనాలను తగ్గించుకోవాలని కోరారు వీరిని చూసి దేశ ప్రజలు స్ఫూర్తిగా తీసుకొని వారి బాటలు నడవాలని రాజనాల స్వేరి కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూలపాక ప్రసాద్ మాగంటి శివ గంద్రకోట రామచందర్ తదితరులు పాల్గొన్నారు...

## 15 నుండి బాలసంస్కార్-2026 ప్రారంభం

**- సేవా సమితి అధ్యక్షులు - కటంగూరి సత్యనారాయణ రెడ్డి**



**హన్మకొండ** : శ్రీరామకృష్ణ సేవా మందిరం, కె ఎల్ ఎన్ రెడ్డి కాలనీ, హనుమకొండ యందు "బాలసంస్కార్-2026 వేసవి శిక్షణా శిబిరం" ఈ నెల 15 నుండి పది రోజులు ప్రతి రోజు ఉదయం 6 నుండి 11 గంటలవరకు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నుండి జరుగనున్న "బాల సంస్కార్ 2026" కార్యక్రమంలో ఈ 10 రోజులపాటు ఉదయం గం. 5:40 ల నుండి గం 11:30ల వరకు తమ సమయాన్ని కెటాయించి, స్వచ్ఛంద వాలంటీర్ గా తమ సేవలు అందించాలన్న తపన, అభిలాష కలవారి కొరకు నిన్న (తేది:14.05.2026 శనివారం) సాయంత్రం 5 గంటలకు "వాలంటీర్ల శిక్షణ సమావేశము" మన సేవా మందిరంలో ఏర్పాటు చేయనైనది. అందులో వాలంటీర్లకు వారి బాధ్యతల పంపిణీ మరియు పాటించాల్సిన నియమనిబంధనల గురించి చర్చించి సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కోవడం జరిగింది. శిక్షణ సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు వేసవి శిబిరంలో పాల్గొనే అర్హత పొందడంతో పాటుగా తమ అమూల్య సేవలతో మూర్తిత్రయ ఆశీస్సులు పొంది 10 రోజుల బాలసంస్కార్-2026 వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని కటంగూరి సత్యనారాయణ రెడ్డి కోరారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్

**- తరలి వచ్చిన ప్రజలు**




**మైదుకూరు** మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామీణ మరియు అభివృద్ధి సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తూ సంబంధిత శాఖ అధికారులకు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఫర్నిచర్ షో రూమ్లో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్** అసిఫ్ నగర్లో ఎం జె క్లాసిక్ ఫర్నిచర్ షోరూం లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదైంది. అయితే, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షోరూం అపార్ట్మెంట్లో ఉండటంతో అప్రమత్తమైన ఫ్లాట్ నివాసులు వెంటనే బయటకు వచ్చి సురక్షితంగా నిలిచారు.

## మున్సిపల్ పారిశ్శుద్ధ కార్మికుల ఆందోళన

మల్కాజ్ గిరి మున్సిపాలిటీ జోన్ పెద్ద అంబర్పేట్ లో ఉన్న నాగోల్ సర్కిల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశ్శుద్ధ కార్మికులు ఆందోళనకు దిగారు. గత రెండు నెలలుగా జీతాలు రాక గత ఎనిమిది నెలలుగా పెంచిన జీతాలు, పీఎఫ్ చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులుగా తమకి ఇవ్వాల్సిన చీపుర్లు, నూనె, షూస్ మరియు సేఫ్టీ జాకెట్స్ కూడా అధికారులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఆందోళన చేస్తున్న కార్మికులకి సీఐటీయూ నాయకులు మద్దతుగా ఆందోళన లో పాల్గొన్నారు. విధులు నిర్వహించేందుకు అవసరమైన సరైన వసతులు కూడా కల్పించలేని అధికారులు 6 నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు మండిపడ్డారు."ఎంత మంది కమిషనర్లు మారినా మా సమస్యలు మాత్రం మారడం లేదు ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. మేమేం చేయాలి" అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.పెద్ద అంబర్పేట్ ప్రాంతంలో సుమారు 200 మంది మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది విధులు బహిష్కరించడంతో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సోమవారం నుండి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు కార్మికులు...

ప్రజాప్రశ్న



## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

# అంత్యేష్టి భవనం ప్రారంభం

### పద్మశాలి సంఘం సమాజ సేవలో మరో ముందడుగు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంత్యేష్టి ( చివరి విడిది భవనం ) ప్రారంభించారు పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు బోలిబోత్తుల దేవదాస్, పాలకవర్గం సభ్యులు పద్మశాలి సంఘం, యువజన విభాగం, ఆధ్వర్యంలో, రిబ్బన్ కట్ చేసి భవనం ప్రారంభించారు ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తులకు సొంత ఇల్లు లేని వారు, ప్రమాదవశాత్తు మరణిస్తే, అంతిమ సంస్కారాలకు ఇబ్బంది కలగకుండా, అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించి, సామాజిక సేవా దృక్పథంతో ఈ భవనం నిర్మించడం జరిగిందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో 3 వ వార్డ్ కౌన్సిలర్ కామిని మురళి, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, రాజారాం, పద్మశాలి ప్రముఖులు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ యువజన విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, లయన్ ఎల్లం రాజు, మధు సుధాన్ ,టి రాజేందర్, శ్రీనివాస్, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల నమోదు ప్రక్రియలో

## రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలి

- వేములవాడ నూతన ఆర్డీఓ : కే.ఎస్.బి. కుమారి
- నూతన ఆర్డీఓ కు అఖిలపక్షం నేతల శుభాకాంక్షలు - ఘన సన్మానం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ నూతన ఆర్డీఓ (రెవెన్యూ డివిజనల్ అధికారి)గా బాధ్యతలు స్వీకరించిన కే.ఎస్.బి. కుమారిని గురువారం అఖిలపక్ష నేతలు శు భాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటర్ల నమోదు కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రతి బూత్‌కు రాజకీయ పార్టీల తరఫున ఒక్కో బీఎల్ఏను నియమించుకోవాలని, ప్రభుత్వ పరంగా బీఎల్ఓలను ఇప్పటికే నియమించామని తెలిపారు. బీఎల్ఓలు, బీఎల్ఏల సమన్వయంతో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఓటర్ల నివారణ, బోగస్ ఓటర్ల నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కోరారు.ఈ సమావేశంలో వి. నిత్యానందరావు (కాంగ్రెస్), పొలాస నరేందర్ (బీఆర్ఎస్), పిన్నింటి హన్మాండ్లు (బీజేపీ), చింతలకోటి రామస్వామి గౌడ్ (టీడీపీ), డిప్యూటీ తహసీల్దార్ సురేష్, డీఏఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

మధురవాడ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ప్రక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనం పై నుండి ప్రమాదవశాత్తు పడి భవన నిర్మాణ కార్మికుడు ఉంకుల రాము(47)మృతి చెందాడు శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మానికి చెందిన రాము,గత కొంత కాలంగా ఇక్కడ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేక రించారు మృతునికి డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు కుమారుడు యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ జి.బాలకృష్ణ ఆదేశాలతో ఎస్.ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాధా రంగ మిత్రమండలి

## వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్ఐసీ రాంబాబు

**గుడివాడ** స్థానిక గుడ్లవల్లేరు మండలంలో వేమవరంలో రాధా రంగా మిత్ర మండలిలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి రాంబాబును స్టేట్ రాధా రంగ మిత్రమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండు తెలుగు రాష్ట్రాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు పాల్గొన్నారు

బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ రంగా అంటే ఒక సామాన్యమైన వ్యక్తి కాదు ఒక కులానికో మతాన్ని కో ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి కాదు అన్ని కులాలకు మతాలకు సంబంధించిన ఒక శక్తి అంటూ ఆయన తెలియజేశారు వంగవీటి మోహన రంగా ఆశయాలకు అనుగుణంగా ఈరోజు పనిచేయడానికి ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు మన రాష్ట్రంలో దేశంలోనే కాక ఇతర దేశాలలో కూడా రంగా అభిమానులు ఆయన ఆశయాల కోసం పని చేస్తున్నారు అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రాధా రంగ మిత్రమండలి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎల్ఐసి రాంబాబు ని నియమించడం ఎంతో గర్వకారణంగా ఉంది అంటూ ఆయనను కొనియాడారు ఆయన గతంలో 2009లో మచిలీపట్నం అసెంబ్లీ బిజెపి తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు అలాగే ఏపీ శాలివాహన సంఘం కన్వీనర్గా ఏపీ ఎంబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఏపీ బీసీ సంఘం జాయింట్ సెక్రెటరీగా ఏపీ స్టేట్ అంబేద్కర్ పూలే సంఘం స్టేట్ ఫౌండర్ ఆయన కొనసాగుతున్నారు ఎల్ఐసి రాంబాబు మాట్లాడుతూ రాధా రంగా మిత్రమండలి లో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నన్ను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఎల్ఐసి రాంబాబు తెలియజేశారు రంగా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాను ఎటువంటి చిన్న సమస్య వచ్చినా కూడా మా పెద్దలు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాను అంటూ నాకు ఈ పదవి ఇచ్చిన బుల్లెట్ ధర్మారావు మరియు రాధా రంగ మిత్రమండలి సభ్యులకు అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు రాధా రంగా మిత్రమండలి గుడివాడ అధ్యక్షులు వడ్డే గిరి, రాధా రంగ మిత్రమండలి నాయకులు మహిళలు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# బెంగాల్ సీన్ రిపీట్ అవుతుందా

**హైదరాబాద్,** తెలంగాణా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని రావాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. తమ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వాలని ఆయన తెలంగాణా ప్రజలకు వినతి చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ కి అధికారం ఇస్తే తెలంగాణా ప్రగతిపథంలో దూసుకుని పోతుందని మోడీ చెప్పుకొచ్చారు. తెలంగాణా రాష్ట్రాన్ని పాలకులు అవినీతి మయం చేశారు అని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ఏలుబడిలో ఎక్కువ అవినీతి జరిగిందని అన్నారు. అందుకే ఆ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళు పై దాటిందని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి చేయకుండా నమ్మించి మోసం చేస్తోంది అని నరేంద్ర మోడీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టి కాషాయానికి పట్టం కట్టాలని ఆయన కోరారు.పశ్చిమ బెంగాల్ ప్రజలు అక్కడ అవినీతి ప్రభుత్వాన్ని ఓడించి బీజేపీ పాలనకు పట్టం కట్టారు అని మోడీ చెప్పుకొచ్చారు. దేశమంతటా బీజేపీ ప్రభంజనం వీస్తోందని ఆయన చెప్పారు. ఇక బీఆర్ఎస్ కాంగ్రెస్ లను ఓడించి ఈసారి చాన్స్ బీజేపీకి ఇవ్వమని ఆయన కోరారు.

ఒక్క చాన్స్ ఇస్తే చాలు అద్భుతమైన ఫలితాలను అందిస్తామని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెడతామని కూడా అంటున్నారు. అయితే ప్రజలు సిద్ధంగా ఉన్నారా అన్నది పక్కన పెడితే తెలంగాణా బీజేపీ రెడీగా ఉందా అన్న చర్చ ముందుకు వస్తోంది. బాధ్యతగల పౌరుడిగా గుర్తించండి.మిగిలిన రాష్ట్రాలలో బీజేపీ గెలుపు కోసం పార్టీ క్యాడర్ అంతా రోడ్డున ఉంటారు. నాయకులు సైతం వీధుల్లోకి వస్తారు. బెంగాల్ లో గత పదేళ్ళుగా బీజేపీ పడిన కష్టమే ఈ రోజు విజయం. ఒక్కో నాయకుడిదీ ఒక్కో వీరోచిత పోరాటం. బెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ని ఎదిరించి నిలబడడం అంటే మాటలు కాదు, కానీ తెగించి వచ్చారు. అలా చేయడం వల్లనే పార్టీ బతికింది. ప్రజా సమస్యల మీద పోరాటం చేయడం వల్లనే బీజేపీ వైపు జనాలు చూశారు. ఆ విధంగా ప్రభుత్వ వ్యతిరేకత కాస్తా బీజేపీ వైపు మళ్ళింది. తెలంగాణాలో బీజేపీ చూస్తే మూడు గ్రూపులూ ఆరు వర్గాలుగా ఉంది. అందరూ నాయకులే అన్నట్లుగా ఉంది గతంలో కాంగ్రెస్ ఏ విధంగా ఉందో ఆ పరిస్థితి ఉందని అంటున్నారు. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ ఏకీకృతం అవుతోంది. రేవంత్ రెడ్డి అందరినీ కలుపుకుని పోతున్నారు. కానీ బీజేపీలో మాత్రం ఆ పరిస్థితి లేదని అంతా అంటున్నారు నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి బీజేపీని కదిలించాల్సి వస్తోంది. కానీ ఈ తరహా ఉత్సాహాన్ని సభలు పెట్టి పార్టీ నేతలు చేయాల్సి ఉంది కదా అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సౌత్ కి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు భావిస్తున్నారు కానీ తెలంగాణా బీజేపీ నేతలు సమాయత్తం అయితేనే అది సాధ్యపడుతుంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఆగని మిల్లర్ల మాయజాలం

**నిజామాబాద్,** మిల్లర్ల మాయజాలానికి రైతన్నలు బలవుతున్నారు. ప్రభుత్వం ఒక వైపు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని అమ్ముకొని మద్దతు ధర పొందాలని చెప్తున్నా ఆచరణలో మాత్రం రైతన్న లు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు పేరిట కొనుగోలు కేంద్రాల్లో నొక్కేయడమే కాకుండా మిల్లర్లు సైతం తరుగు తీసి కాంటా పెట్టుకుంటున్నారు. దీంతో రెండు చోట్ల రైతన్నలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కామారెడ్డి జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అసలే ఆలస్యంగా ఏర్పాటు చేసిన అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యాన్ని తరువు పేరుట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు. క్వింటాలకు నాలుగు కిలోల నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తు తూకం వేస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం క్వింటాలకు నాలుగు కిలోలు మాత్రమే తరుగు తీస్తున్నట్లు నటిస్తున్నారు. నిత్యము మాత్రం రైతులను తరుగు పేరిట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు.రైస్ మిల్లర్రు, అధికారులు, కొనుగోలు కేంద్రాల సెంటర్ నిర్వాహకులు సైతం కుమ్మక్కై రైతులను దోపిడీకి గురి చేస్తున్నారు. దీంతో రైతులు నిలువునా నష్టపోతున్నారు. అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోకపోవడంతో దాన్యం కాంట కావడమే తమ కష్టాలు తీరుతున్నాయని రైతులు సర్దుకుంటున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన నుంచి రైతన్నలకు తంటాలు తప్పడం లేదు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాకులు, అధికారులు చూడాలని ఒకవైపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల సందర్శనాల్లో చెబుతున్న ఆచరణలో మాత్రం అధికారులు అమలు చేయడం లేదు. వర్షాకాలం, వేసవికాలంలో వరి ధాన్యం చేతికి రాగానే ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని భావిస్తున్న రైతులకు అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై తరుగూ పేరిట దోపిడి చేస్తున్నారని రైతు లు ఆరోపిస్తున్నారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన తర్వాత తేమా శాతం వచ్చిన తర్వాతే ధాన్యాన్ని కాంటా పెడుతున్నారు. దీంతోపాటు మరికొంత తరుగు తీయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిల్లర్ వద్దకు వెళ్తే ధాన్యం తరు గు ఏర్పడుతుందని సాకుతో రైతుల నుంచి బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. దీంతో ఒక రైతు 50 కింటల ధాన్యం పండిస్తే కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట క్వింటాల్ వరకు స్వాహా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ధాన్యం కొనుగోలులో కొనుగోలు సెంటర్ నిర్వాహకులతో పాటు పర్యవేక్షణ చేస్తున్న అధికారులు, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల నుంచి తరుగు పేరిట నిలువు దోపిడికి గురి చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం నామమాత్రంగా సూచనలిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సీజన్లో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడి చేసి ఆ డబ్బులను రైస్ మిల్లర్లు, అధికారులు పంచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే ధర తక్కువ వస్తుందొచ్చు కానీ తరువు తీయరని రైతులంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరుగు పేరుట దోపిడీ చేస్తున్న తీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దోపిడీకి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడీ చేసి డబ్బులు దండుకుంటున్నారు. తరువు పేరిట జరుగుతున్న దోపిడి తతంగాన్ని జిల్లా ఉన్నతాధికారులు అరికట్టాలని రైతులు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు విజయ క్రాంతి ప్రతినిధి దృష్టికి తీసుకెళ్లగా సాక్షాదారాలతో ఫిర్యాదు చేస్తే దోపిడీకి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లర్లు కొనుగోలు సెంటర్ల నిర్వాకులు దోపిడీకి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. రైతులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. క్వింటాల్కు రెండు కిలోలు మాత్రమే తరు గు తీస్తున్నారని, ఎక్కువ మొత్తంలో తరుగు తీస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు.

# రామగుండం-మణుగూరు రైల్వే లైన్

**కరీంనగర్,** ఉత్తర తెలంగాణ ప్రజల పాతికేళ్ల నిరీక్షణకు తెరపడింది. రామగుండం-మణుగూరు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడమే కాకుండా.. 2026-27 బడ్జెట్‌లో ఏకంగా రూ.2911.84 కోట్ల నిధులు కేటాయించింది. సుమారు 208 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే మార్గం సింగరేణి బొగ్గు రవాణాకు కీలకమైన 'కోల్ కారిడార్'గా మారనుంది. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పిస్తూనే, భద్రాచలం-రామగుండం మధ్య ప్రయాణ దూరాన్ని 90 కిలోమీటర్ల మేర తగ్గించనుంది. ప్రస్తుతం ఈ లైన్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి.ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త రైల్వే ప్రాజెక్టు పట్టాలెక్కడానికి సర్వం సిద్ధమైంది. రామగుండం-మణుగూరు మధ్య రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న పాతికేళ్ల నాటి కల ఇప్పుడు సాకారమవుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే కాకుండా.. పనుల వేగవంతానికి 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో రూ.2911.84 కోట్ల భారీ నిధులను కేటాయించింది. దీంతో దశాబ్దాల కాలంగా సాగుతున్న ప్రజల నిరీక్షణకు తెరపడటమే కాకుండా.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి.ఈ రైల్వే మార్గం కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ ఒక వ్యూహాత్మక కోల్ కారిడార్‌గా రూపుదిద్దుకోనుంది. దీనివల్ల బొగ్గు రవాణా వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడానికి సుమారు 286 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉండగా.. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆ దూరం 90 కిలోమీటర్ల మేర తగ్గిపోనుంది. ఇది ఇటు సింగరేణి సంస్థకు, అటు ప్రయాణికులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.మొత్తం 207.80 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన బ్రాడ్ గేజ్ మార్గం పెద్దపల్లి జిల్లాలోని రాఘవాపురం వద్ద ప్రారంభమై మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపురం మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు సాగనుంది. ముఖ్యంగా ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు రైలు సౌకర్యం కలగడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం. గతేడాది మే నెలలోనే భూసేకరణ ప్రకటన వెలువడగా.. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సర్వేలు, భూపరీక్షలు పూర్తి కావడంతో పనులు వేగంగా మొదలుకానున్నాయి.ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే న్యూఢిల్లీ-చెన్నై గ్రాండ్ ట్రంక్, నాగ్‌పూర్-విజయవాడ సెక్షన్లకు ఇది ఒక బలమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. భవిష్యత్తులో దీనిని భద్రాచలం-కొవ్వూరు మార్గంతో అనుసంధానించడం ద్వారా విశాఖపట్నం పోర్టు వరకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచవచ్చని అధికారులు భావిస్తున్నారు. రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టును వచ్చే 10-15 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాగా, రామగుండం-మణుగూరు రైల్వే మార్గం ఆమోదం శుభపరిణామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు దీనివల్ల ప్రయాణ సౌకర్యాలు మెరుగవుతాయని చెప్పారు. అనేక పర్యాయాలు కేంద్ర రైల్వే శాఖకు విన్నవించానని.. పార్లమెంట్‌లోనూ మాట్లాడినట్లు ఎంపీ ఈటల రాజేందర్ చెప్పుకొచ్చారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్‌తో రోజుకు 4 కోట్ల ఆదా

**హైదరాబాద్,** మనదేశంలో పేరుపొందిన ఐటి నగరాలలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. ఫార్మా లో కూడా హైదరాబాద్ నగరానికి తిరుగులేని స్థాయి ఉంది. అతిపెద్ద కంపెనీలు.. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఫలితంగా హైదరాబాద్ స్థాయి గ్లోబల్ రేంజ్ ను మించిపోయింది. మన దేశ ఆర్థిక రాజధాని ముంబైతో హైదరాబాద్ పోటీ పడుతుంది. హైదరాబాద్ నగరంలో పెద్ద పెద్ద కంపెనీలు ఏర్పాటైన నేపథ్యంలో.. ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారు. హైదరాబాదులోనే వారు స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో.. హైదరాబాద్ నగరం అంతకంతకు విస్తరిస్తోంది.హైదరాబాదు నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతంలో దాదాపు తొమ్మిది లక్షల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ఆఫీస్ కు వస్తుంటారు. కొన్ని కంపెనీలు గతంలో ప్రయాణ సౌకర్యాన్ని అందించేవి. ఖర్చులను తగ్గించుకోవడానికి చాలావరకు కంపెనీలు ప్రయాణ సౌకర్యాన్ని తగ్గించేశాయి. దీంతో ఉద్యోగులు మొత్తం సొంత వాహనాలలో కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్ వినియోగం పెరిగిపోయింది.. పెట్రోల్ వినియోగం పెరిగిపోవడం వల్ల సహజంగానే కాలుష్యం కూడా పెరిగిపోతూ ఉంటుంది.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్క్ ఫ్రం హోం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావాలు ఇంకా తగ్గలేదని.. దీనివల్ల మన దేశం మీద తీవ్రమైన ఒత్తిడి ఉందని.. అందువల్ల ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడానికి ఆసక్తిని చూపించాలని సూచించారు. ప్రధానమంత్రి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం విధానానికి మరోసారి శ్రీకారం చుడుతున్నట్టు తెలుస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఒకసారి హైదరాబాద్ లో ఉన్న పరిస్థితిని అంచనా వేస్తే..హైదరాబాదు నగరంలో ఐటి కారిడార్ ప్రాంతంలో 9 లక్షల మందికిపైగా పనిచేస్తూ ఉంటారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఇందులో సగం మంది(4.5 లీటర్లు) కి వర్క్ ఫ్రం హోం ఇచ్చినా.. రోజుకు 3.6 లక్షల లీటర్ల పెట్రోల్ ఆదా అవుతుంది. ఒక్కో వ్యక్తి సగటున 20 కిలోమీటర్లు ప్రయాణిస్తారు అనుకుంటే మొత్తం 90 లక్షల కిలోమీటర్లు అవుతుంది. లీటర్ కు సగటున 25 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది అనుకుంటే 3.87 కోట్లు ఆదా అయినట్టే. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 107.50 గా ఉంది. హైదరాబాద్ నగరంలోనే ఇలా ఉంటే, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్ కతా, వంటి నగరాలలో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తే మరింత పెట్రోల్ ఆదా అవుతుందని.. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## పట్టణంలో ట్రాఫిక్ పునరుద్ధరణకు

# పోలీస్ చర్యలు



**కోదాడ** కోదాడ పట్టణంలో ముఖ్య కూడల వద్ద ట్రాఫిక్ క్రమవృద్ధీకరణ చర్యలను ఎస్పీ నర్సింహ స్థానిక పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సామాన్య ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా ట్రాఫిక్ పునరుద్ధరణ చర్యలను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. రోడ్లు ఆక్రమించి ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి స్థానిక మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని సర్దుబాటు చేయాలని రోడ్లపై దుకాణ సామాగ్రి పెట్టకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులను పట్టణ పోలీసులను ఆదేశించారు. కోదాడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణ కోసం ఆపరేషన్ రోప్ అనే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు వాహనదారులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. పట్టణ కేంద్రంలో వాహనాలు నడిపేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలగకుండా క్రమ పద్ధతిలో నడపాలని కోరారు. అవసరమైనచోట రోడ్డు మరమ్మతులు చేపిస్తున్నామని అన్నారు. ఎస్పీ వెంట స్థానిక డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

### శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా


## బాధ్యతలు స్వీకరించిన ముండ్లపాటి చంద్రశేఖర్



**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా ముండ్లపాటి చంద్రశేఖర్ గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా స్థానిక సోషల్ మీడియాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మీద వస్తున్న వార్తలకు స్వస్తి పలుకుతూ కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారు నాకు ప్రిన్సిపల్ గా బాధ్యతలు అప్పచెప్పారు కళాశాల కరస్పాండెంట్ ఆదేశాల మేరకు నేను నేటి నుండి కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరిస్తున్నానని నేటి నుండి నేను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీర్వచనములతో మీడియా మిత్రులు పెద్దల సహాయ సహకారాలతో బ్రహ్మంగారి మఠం మండల వ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు అందరికీ విజ్ఞప్తి చేస్తూ మా కళాశాల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా నియమ నిబంధనలు పాటిస్తూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం నా బాధ్యతని అంతేకాకుండా డిగ్రీ కళాశాల ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన కు అవకాశం కలిగేలాగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లతో మా కళాశాలను అనుసంధానం చేసుకొని ఇక్కడ చదివిన విద్యార్థులకు చదువు అయిపోగానే ఉద్యోగం పొందే లాగా కృషి చేస్తానని నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మండల ప్రజల సహాయ సహకారాలతో మీ అందరి సలహాలు తీసుకొని కళాశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

### తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో

# ఏసీబీ అధికారులు దాడులు



తాడేపల్లిగూడెం పట్టణ ఎస్.ఐ పి.నాగరాజు, కానిస్టేబుల్ బాలకృష్ణ లను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. . ఒక ప్రేమ జంట పెళ్లి వ్యవహారంలో బెదిరించి 70 వేలు డబ్బులు అడిగినట్లుగా సమాచారం.ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితులు ఆశ్రయించారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

# కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా .

## మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్



మంథని( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి కళాశాలలో జరిగిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే నిధులు కేటాయించారని, మంత్రి సహాయ సహకారాలతో కళాశాలను మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇంత అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్న ఈ కళాశాల విద్యార్థిని ప్రభుత్వ కళాశాలలో జిల్లాలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ కళాశాలలో చదివే బదులు అదే స్థాయిలో విద్యనందిస్తున్న ప్రభుత్వ సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అత్యుత్తమ పలితాలు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలోజీ, అధ్యాపకులు రావుల తిరుమల్, శశాంక్ , శ్రీదేవి, నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి, సబిత, మౌనిక, సిబ్బంది బియ్యబాని, అనసూయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బొడ్డు శివ రాజకీయంగా ఎదగాలి: మందకృష్ణ మాదిగ



నాచారం (ప్రశ్న న్యూస్) ఎమ్మార్పీఎస్ నాచారం డివిజన్ నాయకుడు బొడ్డు శివ మాదిగ జన్మదినం సందర్భంగా ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల్ ఇంచార్జి కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ని వారి నివాసంలో కలుసుకుని ఆశీస్సులు తీసుకున్న బొడ్డు శివ అద్వైత్ మాదిగ,ఈ సందర్భంగా శివ అద్వైత్ మరింత స్థాయికి ఎదగాలని కాంక్షించిన మంద కృష్ణ మాదిగఈ కార్యక్రమంలో జాతీయ నాయకులూ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ , మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండిని కలిసిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట సచివాలయంలో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ ఐ ఏ ఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరీని అందచేశారు అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లో వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీలోని నిరుపేద సభ్యులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుటకు ఐదు లక్షల ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించుటకు సంబంధించిన దస్త్రం తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లో పరిశీలనలో ఉన్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండి దృష్టికి తీసుకువెళ్ళగా వారు సానుకూలంగా స్పందిస్తూ రాష్ట ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించుటకు కృషి చేస్తామని తెలియజేసినట్లు తెలిపారు

# తెలంగాణ ప్రభుత్వ సలహాదారునిగా హనుమంతరావు బాధ్యతల స్వీకారం

### ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసిన కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్



కీసర (ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధికి మరింత బలమైన దిశ లభించనుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ, అభివృద్ధి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా వి. హనుమంత రావు బాధ్యతలు స్వీకరించడం పట్ల సామాజిక వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది.ఈ సందర్భంగా కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన వి. హనుమంతరావు కి ఈ బాధ్యతలు రావడం సముచిత నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన వి. హనుమంతరావు ఎల్లప్పుడూ అట్టడుగు వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండారని గుర్తుచేశారు. విద్య, ఉపాధి, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల అమలులో వెనుకబడిన వర్గాలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఆయన మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు ఇతర బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి వి. హనుమంతరావు సేవలు కీలకమవుతాయని సామాజిక వర్గాల నాయకులు భావిస్తున్నారు. ఆయన బాధ్యతల స్వీకారం ద్వారా అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పరంగా మరింత న్యాయం జరుగుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.సామాజిక సమానత్వం, సంక్షేమం, ప్రజాహితం అనే లక్ష్యాలతో ముందుకు సాగే నాయకత్వానికి ఇది మరో గుర్తింపుగా పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల, తల్లిదండ్రుల పాత్ర కీలకం.

### ఘన సన్మానం చేసిన డిగ్రీ కళాశాల ఉపాధ్యాయ బృందం. సర్పంచ్. బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణరెడ్డి.






మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధిలోని. మల్లె పెల్లి దగ్గరలోని డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కీలకమని గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథనిలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పేరెంట్ – టీచర్ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ హోజా తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ధ్యేయంగా కొత్తగా బీ.కాం. బి ఎఫ్ ఎస్ ఐ వంటి ఏఈ డిపి కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందని వాటిలో చేరి చదువు పూర్తి కాగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. కళాశాలలోని సదుపాయాలను కోర్సుల వివరాలను తెలియజేస్తూ విద్యార్థుల సంఖ్య పెంపుదలలో పూర్వ విద్యార్థుల విద్యార్థుల తల్లిదండ్రుల సహాయ సహకారాలు అవసరమని కోరారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షులు కొండల మారుతి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి విద్యార్థుల పెంపునకు అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందజేస్తామని తెలియజేశారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షులు కొండేలా మారుతిని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. అడ్మిషన్ల పెంపు ప్రక్రియలో భాగంగా నాగారం గ్రామపంచాయతీని సందర్శించి గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణను పంచాయతీ సెక్రెటరీ బొగె వికాస్ లను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ పరిశయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆడెపు లక్ష్మీనారాయణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, ముకుందం, శేఖర్, కృష్ణ, శ్రీధరాచార్యులు, రాజు, సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా

# సువీన్ యాదవ్ నియామకం

### – చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

### – కాంగ్రెస్ పార్టీ నూతన మండలాధ్యక్షులు : సువీన్ యాదవ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొమ్మనబోయిన సువీన్ యాదవ్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నియామకాన్ని తక్షణ ప్రభావంతో ఆమోదించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కొత్త అధ్యక్షుడికి పార్టీ అధిష్ఠానం సూచించింది. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ మాట్లాడుతూ,నా నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లాధ్యక్షులు శ్రీనివాస్, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులతో కలిసి పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు.సువీన్ యాదవ్ నియామకంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## గజ్వేల్ సమీకృత కూరగాయల మార్కెట్ దుకాణ సముదాయాల పనులు ప్రారంభం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతంలో అదనపు ఆదాయం సమకూర్చే లక్ష్యంతో రూ.3 కోట్ల వ్యయంతో 28 దుకాణ సముదాయాల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి తెలిపారు.మార్కెట్ వద్ద ఏర్పాటు చేయనున్న దుకాణ సముదాయాల పనుల ప్రారంభ సందర్భంగా ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత మార్కెట్ ఏర్పాటు సమయంలో రోడ్డుపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి అభ్యర్థన మేరకు కొనుగోలుదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. దుకాణ సముదాయాల నిర్మాణం పూర్తయిన తర్వాత సమీకృత మార్కెట్ యార్డుకు అదనపు ఆదాయం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నిధులు కేటాయించారని తెలిపారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధితో పాటు వ్యవసాయ, ఇతర రంగాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీతో పాటు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీ అమలు చేసిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి - రాజన్న

### – నవ వధువు పెళ్లికి రూ.10,116 నగదు కానుక అందజేత



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి – రాజన్న పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రానికి చెందిన బూర్ల అనూష వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తన సొంత నిధుల నుంచి రూ.10,116 నగదును పెళ్లి కానుకగా వధువు కుటుంబ సభ్యులకు అందజేశారు.గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే తన లక్ష్యమని, పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేస్తున్నట్లు సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి – రాజన్న దంపతులు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.సమయానికి ఆర్థిక సహాయం అందించినందుకు వధువు బూర్ల అనూష కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి మహేందర్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో బీఆర్ఎస్ హామీలు గాలికొదిలింది


### కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం : ఆంక్ష రెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ పట్టణంలోని పేద ప్రజలకు ఒక్కరికీ కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి ఆరోపించారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరితో కలిసి వారు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా మంజూరైన ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఐదువేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి ప్రజలను నమ్మించి మూడు సార్లు గజ్వేల్ పట్టణ ప్రజలు కేసీఆర్‌ను గెలిపించారని తెలిపారు. కానీ హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇంకా అర్హులైన వారికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.టీఆర్ఎస్ పాలనలో గూడు లేని పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి నయాపైసా ఖర్చు లేకుండా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమలుకు సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, సీనియర్ నాయకులు ఊడెం శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, గోపిశెట్టి అశోక్ కుమార్ తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# రైతు రాజ్యం పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) పంటలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడమే రైతు రాజ్యమా అంటూ ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయడం జరిగేదని గుర్తు చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాలు అమలు చేశారని అన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రాజ్యం అని ప్రచారం చేసుకుంటూ రైతులను రోడ్డున పడేస్తోందని ఆయన మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు తెచ్చిన పంట నిల్వ ఉండడంతో విత్తనాలు మొలకెత్తుతున్న పరిస్థితి ఏర్పడిందని, గత రెండు నెలలుగా పొద్దుతిరుగుడు తదితర పంటలను కూడా కొనుగోలు చేయకుండా రైతులను నష్టాల పాలుచేస్తున్నారని విమర్శించారు. రైతుల కష్టాన్ని పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డాక్టర్ యాదవ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం మాటలకే పరిమితమైందని అన్నారు.అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. రైతులు, ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



### శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన

# మానస వారణాసి!

టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెరపై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఎత్తుల భయాన్ని జయించా: రష్మిక



ప్రస్తుతం కొచ్చిలో 'మైసా' చిత్ర షూటింగ్‌లో ఉన్న రష్మిక, తనకు ఎంతో కాలంగా ఉన్న 'ఎత్తుల భయాన్ని' అధిగమించినట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఆమె డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ క్రమంలో ఆమె చేతులు, కాళ్లకు గాయాలైనా లెక్కచేయకుండా షూటింగ్‌ను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అడవులు, ట్రెక్కింగ్‌లు, వర్షాల మధ్య ఈ షూటింగ్ తనకు కొత్త శక్తిని ఇచ్చిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. మరోవైపు, రష్మిక – విజయ్ దేవరకొండ జోడీ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. వీరిద్దరూ కలిసి నటించిన ఒక వాణిజ్య ప్రకటన ఇన్‌స్టాగ్రామ్‌లో 9.1 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక లైక్స్ పొందిన రెండో ప్రకటనగా రికార్డు సృష్టించింది. విశేషమేమిటంటే, ఈ జాబితాలో 11.5 మిలియన్ల లైక్స్‌తో మొదటి స్థానంలో ఉన్నది కూడా ఈ జోడీకి సంబంధించిన మరో ప్రకటన కావడం విశేషం. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు.

## వయసుపై చర్చ..

### – టబు అసహనం



సినీ రంగంలో నటీమణుల వయసుపై సమాజం, పరిశ్రమ చూపిస్తున్న అత్యుత్సాహంపై టబు ఘాటుగా స్పందించారు. "మన వయసు గురించి మనకంటే ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుంది" అని ఆమె ఎద్దేవా చేశారు. వయసు పెరగడం అనేది సహజమైన ప్రక్రియ అని, అది ఒక్క రోజులో జరిగేది కాదని ఆమె గుర్తు చేశారు. మహిళలు సాధిస్తున్న విజయాల కంటే వారి వయసు గురించి చర్చించడం బాధాకరమని, దీనివల్ల నటీమణులపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలను తిరస్కరించే విషయంలో తాను అనుసరించే పద్ధతిని కూడా ఆమె వివరించారు. చాలా మంది డేట్స్ లేవని అబద్ధం చెప్పమని సలహా ఇచ్చినా, తాను మాత్రం స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ విషయాన్ని ముఖం మీదనే చెప్పేస్తానని టబు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె తన తాజా చిత్రం 'భూత్ బంగ్లా' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్' చిత్రంలో నటిస్తున్నారు. నాగార్జున 100వ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించబోతున్నారు.

### 'జన నాయగన్' కోసం రంగంలోకి

# సీఎం విజయ్..

### – కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పనిపై ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచించినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు.


ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం. విజయ్ పిలుపుతో నిర్మాత చెన్నైకి పయనమైనట్లు తెలియడంతో, త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటీటీకి వచ్చేసిన భారీ యాక్షన్ థ్రిల్లర్!



కోలీవుడ్ లో యాక్షన్ హీరోల జాబితాపై ఒక లుక్ వేస్తే, 'ఆర్య' పేరు ముందు వరుసలోనే కనిపిస్తుంది. ఒక యాక్షన్ హీరోకి ఉండవలసిన లక్షణాలు పుష్కలంగా ఉన్న హీరో అనే విషయం ఆయనను చూడగానే అర్థమైపోతుంది. అందువల్లనే ఆయన ఆ తరహా సినిమాలు ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. కెరియర్ పరంగా చాలా నిదానంగా ముందుకు వెళుతూ, తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలతోనే ఫ్యాన్స్ ను మెప్పిస్తున్నాడు. అలాంటి 'ఆర్య' నుంచి రీసెంటుగా వచ్చిన సినిమానే 'మిస్టర్ ఎక్స్'. మను ఆనంద్ తెరకెక్కించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ ఇది. లక్ష్మణ్ కుమార్ – వినీత్ జైన్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చింది. మిక్స్డ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, నెల తిరిగేలోగానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 14)నుంచి ఈ సినిమా జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ భాషల్లో అందుబాటులో ఉంది. 1965 నాటి కాలంతో ముడిపడిన ఒక స్పై మిషన్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. గౌతమ్ కార్తీక్ .. శరత్ కుమార్ .. మంజు వారియర్ .. అనఘ .. అతుల్య రవి .. రైసా విల్సన్ ఇతర ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. కనిపించకుండా పోయిన న్యూక్లియర్ క్యాప్సిల్స్ చుట్టూ తిరిగే ఈ కథ, యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని మెప్పిస్తుందనే టాక్ వచ్చింది. విజువల్స్ .. యాక్షన్ సీన్స్ .. భారీతనం ఈ సినిమాలో ప్రధానమైన బలంగా నిలిచాయి. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఎన్ని మార్కులు దక్కించుకుంటుందనేది చూడాలి మరి.

## 'పెద్ది' సినిమాతో కొత్త బిజినెస్ లోకి హోంబలే ఫిల్మ్స్!




'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి భారీ విజయాలతో దేశవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో కీలక ముందడుగు వేసింది. నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు అంతర్జాతీయ పంపిణీ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ ప్రయాణంలో తమ తొలి చిత్రంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది'ని ఎంచుకుంది. భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు చేరవేయాలనే లక్ష్యంతో హోంబలే ఫిల్మ్స్ తన ఓవర్సీస్ పంపిణీ విభాగాన్ని ప్రారంభించింది. దీనికి నాందిగా 'పెద్ది' చిత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ నిర్ణయంతో రామ్ చరణ్ సినిమాకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ప్రచారం లభించనుంది. హోంబలే వంటి పెద్ద సంస్థ నేరుగా పంపిణీ చేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా కీలక దేశాల్లో భారీ స్థాయిలో విడుదల ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇంటెన్స్ మేకోవర్, పవర్‌ఫుల్ విజువల్స్‌తో కూడిన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. దీనికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

**- డీఎస్పీ నాగేంద్రచారి**

**- ప్రతి బ్యాంక్, ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలు,అలారం సిస్టం ఏర్పాటు చేయాలి**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఏటీఎం కేంద్రంలో సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. దోపిడీ, అనుమానాస్పద ఘటనల సమయంలో సిబ్బంది ఎలా స్పందించాలనే విషయంపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. బ్యాంకులోకి వచ్చే వ్యక్తులను తనిఖీ చేసేందుకు ప్రవేశ ద్వారం వద్ద డి ఎఫ్ ఎం డి(డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్) ఏర్పాటు చేయడంతో పాటు, గార్డులకు హెచ్ హెచ్ ఎం డి (హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్) అందుబాటులో ఉంచాలని అన్నారు.రాత్రి సమయల్లో ఏటీఎంలలో నగదు తక్కువ ఉండేలా చూసుకోవాలిని,ఏటీఎంలలో నగదు నింపే సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందిస్తే, ఆ ప్రాంతంలోని బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు ప్రతి బ్యాంకు అధికారికి, సిబ్బందికి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా తెలిసి ఉండాలని అన్నారు.సెక్యూరిటీ గార్డును బ్యాంకు లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, వారి పూర్తి వివరాలు, ఫోటోలు బ్యాంకు వద్ద భద్రపరచాలని తెలిపారు. కొత్తగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమితులయ్యే సిబ్బంది విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చాలా దొంగతనాల్లో నిందితులు సీసీ కెమెరాలపై స్ప్రే చేసి వాటిని పనిచేయకుండా చేయడం, డివిఆర్ దొంగిలించడం లేదా ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందువల్ల డివిఆర్ కనిపించని సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాంకుల లోపల కానీ, పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకి సమాచారం అందించాలని బ్యాంక్ అధికారులకు తెలియజేశారు. సమావేశంలో సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యూజే ఐజేయు మహాసభలను జయప్రదం చేయండి

**పోస్టర్ ఆవిష్కరించిన మహాసభ కమిటీ సభ్యులు**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఈ నెల 24న జరగనున్న టియుడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఐజేయు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్ 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జర్నలిస్ట్ లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యెర్రా ఈశ్వర్, ఎర్పుల సుధాకర్, బాపట్ల మురళి, వెంకట భాస్కర్, షేక్ జానీ, బండ్ల వెంకట్, ఆర్ఎస్ రామానుజం, గుణ సురేష్, దశరద్ రజ్వా, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సువీన్ యాదవ్ నియామకం

**- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు**

**- సువీన్ యాదవ్ నియామకంపై నాయకుల హర్షం - అభినందనలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సువీన్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అనంతపల్లి గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంకు సువీన్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు.అదేవిధంగా వడ్ల కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాట్లు చేయించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి,అనంతపల్లి గ్రామ ఉప సర్పంచ్ గొడిశెల తిరుపతి గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ అనుపట్ల తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ జాగిరి శోభన్ గౌడ్, వార్డ్ సభ్యులు కన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యూపీఎస్ బ్లాస్ట్ తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

**- సాంకేతిక లోపంతో తాత్కాలికంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు**

**- మరమ్మతుల అనంతరమే స్లాట్లు, రిజిస్ట్రేషన్లు**

**- వేములవాడ సబ్ రిజిస్ట్రార్ : విజయ భాస్కర్**




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అకస్మాత్తుగా కంప్యూటర్ సిస్టమ్‌కు అనుసంధానమైన యూపీఎస్ పేలిపోవడంతో కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో అప్రమత్తమైన ఉద్యోగులు కార్యాలయం బయటకు పరుగులు తీశారు. అయితే ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.యూపీఎస్ పేలిన కారణంగా కార్యాలయంలో విద్యుత్ సరఫరా, కంప్యూటర్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది.ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్ స్పందిస్తూ, యూపీఎస్ బ్లాస్ట్ అయిన విషయం నిజమేనని తెలిపారు. సాంకేతిక నిపుణులు వచ్చి మరమ్మత్తులు పూర్తి చేసిన అనంతరం మాత్రమే రిజిస్ట్రేషన్ స్లాట్‌లు బుక్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మరమ్మత్తులు పూర్తైన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తామని, అప్పటివరకు ప్రజలు సహకరించాలని సబ్ రిజిస్ట్రార్ కోరారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి రూ. 2 కోట్ల ఆదాయం

**- ఆలయ ఈఓ : రమాదేవి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గత 44 రోజుల హుండీ ఆదాయం రూ.2,00,17,810 వచ్చినట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. అదనంగా 175 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి భక్తులు సమర్పించారు. హుండీ లెక్కింపును ఆలయ ఈఓ రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయం అధికారి రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, అధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# హిందువుల మనోభావాలను కాపాడాలి

**- బక్రీద్ సందర్భంగా అక్రమ గో వధ, గో రవాణా అరికట్టాలి**

**- జిల్లా ఎస్పీకి విహెచ్‌పీ నేతల వినతి**



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో అక్రమ గో రవాణా, గోవధను అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) నాయకులు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితేకు విశ్వహిందూ పరిషత్ నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ముక్కోటి దేవతల స్వరూపమైన గోమాతను రక్షించి హిందువుల మనోభావాలను గౌరవించాలని వారు విజ్ఞప్తి చేశారు.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా గోవులు, కోడెల రవాణాను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అలాగే దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న కళ్యాణి బిర్యానీ సెంటర్లు, గోవధ కేంద్రాలను తొలగించి కోట్లాది మంది హిందువుల విశ్వాసాలను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పీ నాయకులు గడప కిషోర్ రావు, నాగుల రాము గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణన్, మహేష్, కమలాకర్, గోపి తదితర హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్‌తో కౌలు రైతు మృతి

**- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : మందాటి శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,పెగడపల్లి మండలం,మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన చంద్రయ్య (49) విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందాడు.రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామ శివారులో కౌలుకు తీసుకున్న మామిడి తోటలో వేసిన కరెంటు వైర్‌ను తొలగించే క్రమంలో చంద్రయ్య ఆ వైర్‌ను చేతికి చుట్టుకుంటూ తీసుకెళుతుండగా మధ్యలో ఉన్న జాయింట్ వద్ద అకస్మాత్తుగా విద్యుత్ ప్రవహించింది. దీంతో ఎడమ చేతి మణికట్టుకు షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

# ప్రజల ఫిర్యాదు పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**-టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్ సిరిసిల్ల సర్కిల్ ఎస్.ఈ : వేణు మాధవ్**

**- బోయినిపల్లి సెక్షన్ కార్యాలయాన్ని పరిశీలించిన టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ : వేణు మాధవ్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలోని టీజీఎన్‌పీడీసీఎల్ సెక్షన్ కార్యాలయాన్ని సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణు మాధవ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు సమస్యలను స్థానిక సెస్ ఏఈ ప్రశాంత్ తో కలిసి సమీక్షించారు.ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల వివరాలను తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే బోయినిపల్లి మండల కేంద్రంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు తగ్గిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్ఈ వేణు మాధవ్ పేర్కొన్నారు.

# పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ అంధకారం

**- నీట్ యూజీ పరీక్ష రద్దుపై కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోవాలి**

**- ఏఐఎస్బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



కరీంనగర్ ( ప్రశ్న న్యూస్) పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3, 2026న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షను ఎన్‌టిఏ రద్దు చేయడం దురదృష్టకరమని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కూడా నీట్ పరీక్ష పత్రం లీక్ కావడంతో పరీక్ష రద్దైన విషయాన్ని గుర్తు చేస్తూ, వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు ఎన్‌టిఏ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈసారి పరీక్ష అనంతరం రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయిన 'గెస్ పేపర్' అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు బయటపడటం ఆందోళనకరమన్నారు. లీకైన ప్రశ్నాపత్రాలను భారీ మొత్తాలకు విక్రయించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర విషయమని పేర్కొన్నారు. నీట్ స్కామ్‌ల కారణంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్‌టిఏను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మెట్టు రాకేష్, వంశీ, గణేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

**ప్రేమ వివాహం చేసుకుని..**

**కుమారుడు పుట్టాక ముఖం చాటేశాడని ఆరోపణ**

**9 నెలల బాబుతో భర్త ఇంటి ముందు**

**ఆందోళనకు దిగిన మహిళ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) ప్రేమిస్తున్నానని వెంటపడి పెండ్లి చేసుకుని, కుమారుడు పుట్టిన తర్వాత భర్త ముఖం చాటేశాడని ఆరోపిస్తూ ఓ మహిళ తన 9 నెలల బాబుతో కలిసి భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగిన ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాతూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ కన్నుముత్తుల గౌరి తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన ఆమె గజ్వేల్‌లోని ఓ బ్యాంగిల్ స్టోర్‌లో పనిచేస్తుండగా, పాతూరు గ్రామానికి చెందిన సింగ్గిరెడ్డి అభిలాష్ రెడ్డి పరిచయమై ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడని తెలిపింది.అభిలాష్ రెడ్డి తల్లిదండ్రులు పెండ్లికి నిరాకరించడంతో, పెద్దలను ఎదిరించి 2023లో యాదగిరిగుట్ట దేవస్థానంలో వివాహం చేసుకున్నామని పేర్కొంది. అనంతరం వారికి కుమారుడు జన్మించాడని తెలిపింది.అయితే రెండు నెలల క్రితం అభిలాష్ రెడ్డి కనిపించడం లేదంటూ అతని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అప్పటి నుంచి తన భర్త తనకు దూరంగా ఉంటూ ముఖం చాటేస్తున్నాడని గౌరి ఆరోపించింది.భర్త తనను, బిడ్డను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ గౌరి పాతూరు గ్రామంలోని భర్త ఇంటి ఎదుట బాబుతో కలిసి నిరసన చేపట్టింది. ఈ విషయం తెలిసిన అభిలాష్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

# అపరిశుభ్రంగా మారిన ఓయూ స్విమ్మింగ్ పూల్

- ఫీజులు భారీగా, సౌకర్యాలు శూన్యం
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం
- కోచర్లు ఉన్నారా.? లేక వారి పేరుతో నిధులు స్వాహానా.?
- నిర్వహణ నిధులు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయి.?
- ఓయూ స్పోర్ట్స్ విభాగంలో నిధులన్నీ పక్కదారే సౌకర్యాలన్ని శూన్యమే





ఓయూ (ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో తీవ్ర నిర్లక్ష్యం నెలకొన్నట్లు విద్యార్థులు, స్విమ్మింగ్ నేర్చుకునే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరొందిన ఓయూలో క్రీడా సదుపాయాలు ఆదర్శంగా ఉండాల్సి ఉండగా, స్విమ్మింగ్ పూల్ పరిస్థితి మాత్రం అత్యంత దారుణంగా మారిందని విద్యార్థుల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కనీస పరిశుభ్రత, సమయపాలన, సరైన కోచింగ్ వంటి అంశాలు పూర్తిగా గాలికొదిలేశారని పలువురు మండిపడుతున్నారు. స్విమ్మింగ్ పూల్‌లో నీటిని సకాలంలో మార్చడం లేదని, ఫిల్ట్రేషన్ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని చెబుతున్నారు. నీళ్లలో మురికి పేరుకుపోవడంతో పాటు పూల్ అడుగుభాగంలో వెంట్రుకలు, చెత్త అలాగే కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. పూల్‌లోకి దిగిన తరువాతే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత లేకపోవడంతో చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇక కోచింగ్ విషయానికి వస్తే పరిస్థితి మరింత విచారకరంగా ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగా స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చే వారిని, ఇప్పటికే అనుభవం ఉన్న వారితో కలిపి పూల్‌లోకి దింపేస్తున్నారని చెబుతున్నారు. దిగి కాళ్లు కొట్టండి, ఈదండి అని చెప్పడం తప్ప సరైన ట్రైనింగ్, టెక్నిక్స్ నేర్పించే కోచర్ లేరని పలువురు విమర్శిస్తున్నారు. కోచర్లు పూల్ వద్ద కూర్చోవడం తప్ప నిజంగా శిక్షణ ఇవ్వడంపై అసలు దృష్టి పెట్టడం లేదని, అసలు కోచర్లు ఉన్నారా.? లేక వాళ్ళ పేరుతో డబ్బులు స్వాహా చేస్తున్నారా.? అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదటిసారి వచ్చే వారికి ప్రత్యేక శ్రద్ధ, భద్రతా సూచనలు, స్టెప్ బై స్టెప్ గైడెన్స్ వంటి అంశాలు పూర్తిగా లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. టైమింగ్ విషయంలో కూడా తీవ్ర గందరగోళం నెలకొంటోందని తెలుస్తోంది. ప్రకటించిన సమయాలకు పూల్ తెరవకపోవడం, ఎప్పుడు మూసేస్తారో స్పష్టత లేకపోవడం వల్ల ఫీజులు చెల్లించిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు తమ సమయాన్ని కేటాయించుకొని వచ్చినా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఫీజుల విషయంలో మాత్రం యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు ఒక రేటు, బయటి వ్యక్తులకు మరో రేటు, సిబ్బందికి మరో విధంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. కానీ ఫీజులకు తగ్గ సౌకర్యాలు స్విమ్మింగ్ పూల్ పరిధిలో ఏమాత్రం ఎక్కడా కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఓయూ స్పోర్ట్స్ విభాగ అధికారులు డబ్బులు తీసుకోవడంలో చూపే శ్రద్ధ, సౌకర్యాల కల్పనలో ఎందుకు కనిపించడం లేదు.? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ఇలాంటి పూర్తి నిర్లక్ష్యం కొనసాగడం పట్ల క్రీడాభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్‌ను పూర్తిస్థాయిలో శుభ్రపరచడంతో పాటు,



కోచింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని, టైమింగ్‌లలో క్రమశిక్షణ తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వెంటనే స్పోర్ట్స్ విభాగ అధిపతి, రిజిస్టర్, వీసీలు స్పందించి సమస్యని యుద్ధ ప్రతిపాదికన తీర్చాలని విద్యార్థులు విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

# రాత్రివేళ రోడ్లపై రెచ్చిపోతున్న దందా

- టిఫిన్ సెంటర్లు, ఫుడ్ కోర్టుల పేరుతో ట్రాఫిక్‌కు తూట్లు
- మామూళ్ల మత్తులో మౌనంగా ట్రాఫిక్ విభాగం
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపమా.? లేక కింది స్థాయి సిబ్బంది అవినీతి దాహమా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ నగరం రాత్రివేళల్లో మరో రూపం దాలుస్తోంది. పగలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయే ప్రధాన రహదారులు, రాత్రి వేళల్లో అక్రమ టిఫిన్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, ఫాస్ట్ ఫుడ్ ఆటో బండ్లతో పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అనేక ప్రధాన రోడ్లపై అర్ధరాత్రి తర్వాత అసలు ట్రాఫిక్ నియంత్రణ అనే మాటే కనిపించడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. రాత్రి 9 గంటల తర్వాత మొదలయ్యే ఈ దందా తెల్లవారుజామున దాదాపు 3 గంటల వరకు కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే క్లబ్ వద్ద, సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్, బేగంపేట, అమీర్పేట లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రోడ్ల పక్కనే టిఫిన్ బండ్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి రోడ్లపై వాహనాలను యథేచ్ఛగా నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభిస్తోంది. రెండు చక్రాల వాహనాలు, కార్లు, ఆటోలు రోడ్డుమధ్యలోనే పార్క్ చేయడంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, కొంతమంది మద్యం సేవించి ఈ టిఫిన్ సెంటర్ల, ఫుడ్ సెంటర్ల వద్ద అర్ధరాత్రి వరకు హంగామా చేస్తుండటం. బూతులు, గొడవలు, బైక్‌లతో రేసులు, భారీ శబ్దాలతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో కుటుంబాలతో నివసించే కాలనీలకు సమీపంలోనే ఈ దందాలు కొనసాగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ప్రజల కోసం నిర్మిస్తే వాటిని ఆక్రమించి వ్యాపారాల కోసం వినియోగించడం ఏ చట్టం కింద ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు అనుమతించారో అధికారులే




చెప్పాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై టేబుళ్లు, కుర్చీలు, స్టౌలు, గ్యాస్ సిలిండర్లు పెట్టి పూర్తి స్థాయిలో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. అయితే ఈ అక్రమ దందా వెనుక భారీ మామూళ్ల వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు ఇప్పుడు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి. ఒక్కో బండికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి ట్రాఫిక్ సిబ్బందికి మామూళ్లు చేరుతున్నాయంటూ స్థానికులు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. రాత్రివేళల్లో ట్రాఫిక్ పోలీసులు అక్కడే తిరుగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొందరు ఎస్‌బీ




సిబ్బంది కూడా స్థానిక పోలీసుల నిర్లక్ష్యాన్ని మరింత పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర అభివృద్ధి, స్మార్ట్ సిటీ పేర్లు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రధాన రోడ్లపైనే జరుగుతున్న ఈ బహిరంగ అక్రమాలను ఎందుకు అరికట్టలేకపోతోందన్న ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. ట్రాఫిక్ నియంత్రణ పేరుతో సాధారణ ప్రజలకు జరిమానాలు విధించే ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రాత్రివేళల్లో రోడ్లను ఆక్రమించి ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న ఈ దందాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రివేళల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ టిఫిన్ సెంటర్లు, ఫుడ్ కోర్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రేపు మరిన్ని ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఉన్నత అధికారులకు తప్పదని హెచ్చరిస్తున్నారు.

## స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలి

- మంత్రి సీతక్కకు కవిత విజ్ఞప్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

## ఏపీలో విస్తరణకు ఉబెర్ రెడీ

- చంద్రబాబు, లోకేష్‌తో సంస్థ సీఈవో భేటీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబెర్, ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ గ్లోబల్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్రంలో పెట్టుబడులు, విస్తరణ అవకాశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ విశాఖపట్నంలోని తమ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను విస్తరించాలని ఉబెర్ యోచిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు అవసరమైన నైపుణ్యాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను ఒక బలమైన టాలెంట్ హబ్‌గా ఉబెర్ పరిగణించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అమరావతిలో అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌పై ఉబెర్ ఆసక్తి కనబరిచినట్లు సీఎం వెల్లడించారు. ఈ సాంకేతికతను ఉపయోగించుకుని అధునాతన లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ అల్గారిథమ్‌లను అభివృద్ధి చేయాలని కంపెనీ భావిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ కూడా స్పందించారు. ఉబెర్ గ్లోబల్ లీడర్‌షిప్ బృందంతో జరిగిన విందు సమావేశంలో టెక్నాలజీ, మొబిలిటీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పట్టణ రవాణా భవిష్యత్తు వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తును తీర్చిదిద్దే గ్లోబల్ లీడర్లతో ఆలోచనలు పంచుకోవడం ఎంతో విలువైనదని లోకేష్ పేర్కొన్నారు. ఈ భేటీతో ఏపీలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని నిపుణులు భావిస్తున్నారు.

## ఇక కార్లలోనూ డాల్బీ అట్మాస్ సౌండ్

- గూగుల్ లేటెస్ట్ అప్ డేట్!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, తమ ఆండ్రాయిడ్ ఆటో ప్లాట్‌ఫామ్‌లో సరికొత్త ఫీచర్‌ను జోడించింది. వినియోగదారులకు కార్లలో మరింత నాణ్యమైన, స్పష్టమైన ఆడియో అనుభూతిని అందించేందుకు డాల్బీ అట్మాస్ సపోర్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. సపోర్ట్ ఉన్న యాప్‌లు, కార్లలో ఈ ఫీచర్ లభించనుంది. తొలి దశలో బీఎండబ్ల్యూ, మహీంద్రా, మెర్సిడెస్-బెంజ్, రెనో, స్కోడా, టాటా, వోల్వో వంటి కార్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఆడియోతో పాటు వీడియో నాణ్యతపై కూడా గూగుల్ దృష్టి సారించింది. ఆండ్రాయిడ్ ఆటోలో తొలిసారిగా ఫుల్ హెచ్‌డీ (1080పి) 60ఎఫ్‌పీఎస్ వీడియో స్ట్రీమింగ్‌కు సపోర్ట్ ప్రకటించింది. దీంతో పాటు ఆండ్రాయిడ్ ఆటో యూజర్ ఇంటర్‌ఫేస్‌ను కూడా 'మెటీరియల్ 3 ఎక్స్‌ప్రెసివ్' డిజైన్‌తో పూర్తిగా మార్చింది. దీనివల్ల కొత్త ఫాంట్లు, ఆకర్షణీయమైన యానిమేషన్లు, వాల్‌పేపర్లు లభిస్తాయి. అంతేకాదు, గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా గూగుల్ మ్యాప్స్‌కు అతిపెద్ద అప్‌డేట్ వచ్చింది. 'ఇమ్మర్సివ్ నావిగేషన్' పేరుతో 3డీలో భవనాలు, ఓవర్‌పాస్‌లు, రోడ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి వివరాలను ఇది స్పష్టంగా చూపిస్తుంది. అలాగే, ఫోన్‌లోని జెమినీ ఏఐ ఫీచర్లను నేరుగా కార్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై ఉపయోగించుకునే సౌకర్యం కూడా కల్పించారు. గూగుల్ బిల్ట్-ఇన్ ఉన్న కార్లలో జూమ్ వంటి మీటింగ్ యాప్‌లకు కూడా సపోర్ట్ లభించనుంది. ఈ కొత్త ఫీచర్లన్నీ సపోర్ట్ చేసే కార్లలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

# వ్యక్తిగత దాడులు.. పొలిటికల్ అస్త్రాలు

- బండి భగీరథ్ కేసు చుట్టూ మారుతున్న తెలంగాణ రాజకీయం
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వెలిసిన వాల్ పోస్టర్లు
- బిజెపి పార్టీకి తీవ్ర నష్టంగా విశ్లేషకుల హెచ్చరికలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వ్యక్తిగత స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక నేరపూరిత దర్యాప్తుగా మిగలకుండా, రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి వంటి ప్రధాన ప్రాంతాల్లో బండి భగీరథ్ పరారీ అంటూ వెలిసిన పోస్టర్లు ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాయి. అసలు ఈ పోస్టర్లు ఎవరు వేశారు.? దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి.? అన్నది పక్కన పెడితే, ప్రత్యర్థిని దెబ్బతీయడానికి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

### - రాజకీయంగా హైపర్ యాక్టివ్

ఈ వ్యవహారం రెండు భిన్నమైన కథనాల మధ్య నలుగుతోంది. ఒక వైపు, ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. మరోవైపు, ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని, రూ. 5 కోట్ల వరకు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేశారని భగీరథ్ తరపున కౌంటర్ ఫిర్యాదు నమోదైంది. చట్టం తన పని తాను చేసుకుపోవాల్సి ఉండగా, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ట్రోలింగ్ ఈ కేసులో అసలు బాధితులు ఎవరో తేల్చలేనంత గందరగోళాన్ని సృష్టిస్తోంది.

### - బాధ్యత ఎవరిది.?

సాధారణంగా ఏదైనా కేసు నమోదైనప్పుడు దర్యాప్తుకు సహకరించాల్సిన బాధ్యత నిందితులపై ఉంటుంది. అయితే, బుధవారం సిట్ విచారణకు భగీరథ్ హాజరుకాలేదు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయిన తర్వాత వచ్చేలా రెండు రోజుల తరవాత వస్తానని సమాచారం పంపారు. బండి సంజయ్ రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే తన కుమారుడిని బలి చేస్తున్నారని, ఇది తనపై జరుగుతున్న పొలిటికల్ హిట్ జాబ్ అని ఆరోపిస్తున్నారు. అధికార పక్షం మాత్రం నేరం చేసింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని, బాధితురాలికి న్యాయం జరగాల్సిందేనని పట్టుబడుతోంది. మరో వైపు బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలంటున్నారు.

### - నలిగిపోతున్న బాధితురాలి కుటుంబం

ఈ రాజకీయ యుద్ధంలో బాధితురాలి కుటుంబానికే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే క్రమంలో, బాధితురాలి గుర్తింపును గానీ, ఆమె మానసిక స్థితిని గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఈ సమస్యను పరిష్కరించడానికి వివాహం వంటి వింత సలహాలు ఇవ్వడం, దానికి టీపీసీసీ ఖండన తెలపడం వంటివి చూస్తుంటే ఈ అంశం ఎంతటి అయోమయానికి గురైందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో నేతలను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి వారి పిల్లలను, కుటుంబ సభ్యులను వాడుకునే సంస్కృతి పెరిగిపోవడం ఆందోళనకరమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అది భగీరథ్ అయినా, మరెవరైనా నేరం నిరూపితమైతే చట్టపరమైన శిక్ష అనుభవించాలి. కానీ, దర్యాప్తు పూర్తికాకముందే పోస్టర్లతో వేధించడం, రాజకీయ కుట్రలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. చివరకు కోర్టులో తేలాల్సిన అంశాన్ని వీధి పోరాటంగా మార్చడం వల్ల వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనవ వ్యక్తమవుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588